ఇసుక మస్కా..!

- ఉచితం పేరుతో హంద్రీ నది లూటీ
- కూటమి, వైసీపీ నాయకుల అక్రమ రవాణా
- ఇష్టారాజ్యంగా అనుమతులు.. పెద్ద ఎత్తున డంప్‌లు
- ప్రేక్షక పాత్రలో పోలీసులు, రెవెన్యూ అధికారులు

కోడుమూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి)

హంద్రీ నదిని లూటీ చేస్తున్నారు. జోరుగా ఇసుక తవ్వకాలు జరిపి అక్రమంగా రవాణా చేస్తున్నారు. కోడుమూరు పట్టణంలోని హంద్రీనది, మండలంలోని గోరంట్ల, వర్కూరు, అనుగొండ, ముడుమలగుర్తి ప్రాంతాల నుంచి రేయింబవళ్లు రోజుకు వందలాది ట్రాక్టర్లలో ఇసుకను అక్రమంగా ఇతర ప్రాంతాలకు తరలించి పెద్ద ఎత్తున సొమ్ము చేసుకుంటున్నారు. కూటమి, వైసీపీ నాయకులు కుమ్మక్కై ఇసుక దోపిడీ సాగిస్తున్నారు. ఉచిత ఇసుక విధానం దాపున అక్రమాలకు పాల్పడుతుంటే చర్యలు తీసుకోవాల్సిన రెవెన్యూ అధికారులు, పోలీసులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు.



ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా..

హంద్రీనది పరివాహక ప్రాంతాల్లో కూడా నిర్మాణ రంగానికి ఇసుక కోసం ట్రాక్టర్ నంబర్, ట్రాలీ నంబర్ పొందుపరుస్తూ సచివాలయాల్లో ఆన్‌లైన్ బుకింగ్ చేసుకోవాలి. బుకింగ్ చేసుకొన్న రశీదును పంచాయతీ కార్యదర్శి అనుమతి తీసుకొని నిర్మాణం చేపడుతున్న ప్రదేశానికి పగలు మాత్రమే ఇసుకను తీసుకెళ్లాలి. ఏ గ్రామంలోని ఇసుకను ఆ గ్రామ పరిధి వరకే ఉపయోగించాలి. అంతేకాకుండా అనుమతి పొందిన వాహనానికి ఉచిత ఇసుక రవాణా అనే ఫ్లెక్సీ ఉండాలని కూటమి ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. కానీ ఇసుక మాఫియా ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా ఉచితం పేరుతో హంద్రీ నదిని లూటీ చేస్తోంది. రాత్రి వేళల్లో సుదూర ప్రాంతాలకు ఇసుకను తలించుకుపోతున్నారు. ఇందుకు కొంత మంది ప్రజా ప్రతినిధులు ఇసుక దందాకు పూర్తి మద్దతు ఇస్తుండటంతో ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు. ఇసుక అక్రమ రవాణాను అదుపు చేయాల్సిన పోలీసులు, రెవెన్యూ, పంచాయతీరాజ్, నీటి పారుదల శాఖ, మైన్స్ అండ్ జియాలజీ, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడం పట్ల ప్రజల్లో పలు అనుమానాలు వెలువడుతున్నాయి.



ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్

కోడుమూరు, గోరంట్ల, వర్కూరు గ్రామాల్లో..

ముఖ్యంగా కోడుమూరు, గోరంట్ల, వర్కూరు గ్రామంలోని కూటమి, వైసీపీ నాయకులతో ఇసుక మాఫియా కుమ్మక్కై హంద్రీ నదిలోని ఇసుకను ఖాళీ చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఎలాంటి అనుమతులు లేకుండా ఇతర ప్రాంతాలకు ఇసుకను అక్రమంగా తరలిస్తూ రూ.లక్షలు దండుకుంటున్నారు. గోరంట్ల గ్రామంలో ఇద్దరు టీడీపీ నాయకులు కలిసి డోన్, పత్తికొండ, క్రిష్ణగిరి మండలాలకు పెద్ద ఎత్తును ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం. వర్కూరు గ్రామంలో వైసీపీ, టీడీపీ నాయకులు కలిసి జోరుగా ఇసుక వ్యాపారం సాగిస్తున్నారు. కోడుమూరులో వైసీపీ, టీడీపీ నాయకుల కనుసైగల మధ్య అక్రమ ఇసుక రవాణా సాగుతోందన్న చర్చ సాగుతోంది.

కోడుమూరులో ఇష్టారాజ్యంగా అనుమతులు

కూటమి ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలను పట్టించుకోకుండా పంచాయతీ కార్యదర్శి అజయ్‌భాస్కర్ ఇసుక తరలింపునకు ఇష్టారాజ్యంగా అనుమతులు ఇచ్చారని పలువురు ఆరోపిస్తున్నారు. దీంతో రెచ్చిపోయిన ఇసుక మాఫియా రాత్రి, పగలు తేడా లేకుండా ఇసుకను తరలించుకుపోతోంది. కొంత మంది రియల్టర్లు ఇసుక అవసరం లేకపోయినా పెద్ద ఎత్తున ఇసుక డంప్ నిల్వ చేసుకున్నారు. పట్టణంలోని ప్రధాన రహదారి పక్కనే ఒక రియల్టర్ ఇసుకను డంప్ చేయడమే ఇందుకు నిదర్శనం. అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే రూ.10 వేల వరకు జరిమానా విధించడంతో పాటు వాహనాన్ని సీజ్ కూడా చేయవచ్చు. అలాగే ఇసుకను అక్రమ డంప్ చేసిన వాళ్లపై రూ.2 లక్షల వరకు జరిమానా, 2 సంవత్సరాల వరకు జైలు జీవితం అనుభవించే పరిస్థితులు ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అక్రమ ఇసుక మాఫియాపై కొరడా ఝుళిపించాల్సిన అవసరం ఉంది.

(మిగతా 6వ పేజీలో...)



భూగర్భ జలాలు అడుగంటడంతో ఒట్టిపోయిన బోరు

8న జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం



కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 8న నిర్వహించనున్నట్లు జిల్లా పరిషత్ సీఈఓ జి. నాసరరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్ సమావేశ భవనంలో జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అధ్యక్షతన ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఉమ్మడి జిల్లా అధికారులు హాజరుకానున్నట్లు ఆయన పేర్కొన్నారు. గ్రామీణ నీటి సరఫరా, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్, విద్యుత్ శాఖలపై జరిగే సమావేశాల్లో జడ్పీటీసీలు, ఎంపీపీలు పాల్గొంటారని ఆయన తెలిపారు. అదేవిధంగా ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు 1, 2 స్థాయి సంఘ సమావేశాలు కూడా నిర్వహిస్తున్నట్లు సీఈఓ పేర్కొన్నారు.

నేడు, రేపు కోర్టు విధుల బహిష్కరణ

బార్ అసోసియేషన్ వెల్లడి

కర్నూలు లీగల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబరు 145కు వ్యతిరేకంగా న్యాయవాదులు గురు, శుక్రవారాల్లో తమ కోర్టు విధులను బహిష్కరించడానికి నిర్ణయించినట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి బీఎస్ రవికాంత్ ప్రసాద్‌లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జీవో 145 మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఈగల్ అనే దర్యాప్తు సంస్థను ఏర్పాటు చేసి కోర్టులో పెండింగ్‌లో ఉన్న మాదక ద్రవ్యాలు, గంజాయి కేసులను విశాఖపట్నం, రాజమహేంద్రవరం, విజయవాడ, తిరుపతిలో ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేసింది. రాష్ట్రంలో వివిధ కోర్టులలో పెండింగ్‌లో ఉన్న ఈ కేసులను ఈ జీవో ద్వారా ఏర్పాటైన ఫాస్ట్ ట్రాక్ కోర్టులకు రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసింది. దీంతో కక్షిదారులు, న్యాయవాదులు సుదూరంగా ఉండే ఈ కోర్టులకు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని స్థానిక న్యాయవాదులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం స్థానిక బార్ అసోసియేషన్‌లో అత్యవసర ఈసీ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

కంప్యూటరీకరణలో మొదటి స్థానం

- వ్యవసాయ పరపతి సంఘాలలో అక్రమాలకు చెక్ పడినట్లే
- రైతుకు రుణం నిమిషాల్లో మంజూరు

కర్నూలు అగ్రికల్చర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం దశాబ్దాల తరబడి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల్లో కంప్యూటరీకరణకు చర్యలు తీసుకుంటున్నా.. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాతనే ఒక కొలిక్కి వచ్చినట్లు కేంద్ర సహకార బ్యాంకు అధికారులు స్పష్టం చేస్తున్నారు. గత అక్టోబరు 2 నాటికల్లా సంఘాల్లో కంప్యూటరీకరణ పూర్తి చేయాలని రాష్ట్ర సహకార సంస్థ (ఆప్కాబ్) లక్ష్యాన్ని నిర్దేశించింది. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు రాష్ట్రంలోని కేంద్ర సహకార బ్యాంకు అధికారులు రేయింబవళ్లు శ్రమించారు. అయితే.. రాష్ట్రంలోని మిగిలిన కేంద్ర సహకార బ్యాంకులతో పోలిస్తే.. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల్లో కంప్యూటరీకరణ పనులు దాదాపు కొలిక్కి వచ్చినట్లు అధికారులు తెలిపారు. డీసీటీ డేటా (క్యాప్షన్ టూల్స్) రైతుల వివరాలను అప్‌లోడ్ చేసే పనుల్లో దాదాపు 100 శాతం ప్రగతి సాధించినట్లు ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు సీఈవో విజయకుమార్ తెలిపారు. రాష్ట్రం మొత్తం మీద కర్నూలు జిల్లాలో కంప్యూటరీకరణ కార్యక్రమం పూర్తి చేయడంలో బ్యాంకు అధికారులతోపాటు సహకార సంఘాల సీఈవోలు, సిబ్బంది రేయింబవళ్లు శ్రమించారని బ్యాంకు సీఈవో విజయకుమార్ అభినందించారు.

నేలపైనే గర్భిణులు



నేల మీద కూర్చున్న గర్భిణులు

- గంటల తరబడి స్కానింగ్ కోసం నిరీక్షణ

కర్నూలు హాస్పిటల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మాతా శిశు సంరక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.కోట్లు వెచ్చిస్తున్నా అనుకున్న లక్ష్యం మాత్రం నెరవేరడం లేదు. జిల్లా కేంద్రమైన కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో అల్ట్రాసౌండ్ స్కానింగ్, టిఫా స్కాన్ కోసం గంటల తరబడి గర్భిణులు నేలపైనే కూర్చుంటున్నారు. న్యూడయోగ్నస్టిక్ సెంటర్‌లో సాధారణ రోగులు, వారి సహాయకులు మాత్రం కుర్చీల్లో కూర్చుంటున్నారు. బుధవారం సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన గర్భిణులు కింద కూర్చొని అవస్థలు పడ్డారు. అధికారులు స్పందించి గర్భిణులకు అవసరమైన మేరకు కుర్చీలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.



టిఫా స్కానింగ్ కోసం నేల మీద కూర్చొని నిరీక్షిస్తున్న గర్భిణులు

14న జాతీయ లోక్ అదాలత్

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి

కర్నూలు లీగల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 14న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి వెల్లడించారు. అందులో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేందుకు పోలీసులు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం స్థానిక లోక్ అదాలత్ కార్యాలయంలో పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీకి అర్హత కలిగి ఉన్న క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు, ప్రీ లిటిగేషన్ కేసులను ఈ జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని, కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. న్యాయాధికారి పి. జ్యోత్న్న దేవి మాట్లాడుతూ పోలీసు అధికారులు కక్షిదారులను సంప్రదించి వారిని రాజీ చేసి వీలైనన్ని ఎక్కువ కేసులు పోలీస్ స్టేషన్ల వారీగా పరిష్కారమయ్యేందుకు చొరవ తీసుకోవాలన్నారు. ఈ సమీక్షలో ఎక్సైజ్ కోర్టు మేజిస్ట్రేట్ ఎం. సరోజనమ్మ, పలువురు సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకటశేషాద్రి

వేరుశనగ ధర పతనం

- క్వింటా రూ.5,919



విక్రయానికి వచ్చిన వేరుశనగ దిగుబడులు

ఆదోని అగ్రికల్చర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో వేరుశనగ ధరలు భారీగా పతనమయ్యాయి. గత వారంతో పోల్చితే క్వింటం రూ.400 పైగా ధర తగ్గింది. ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర కంటే ధర తక్కువగా పలుకుతుండడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎరువులు, విత్తనాల ధరలు, కూలీ ఖర్చులు పెరిగాయని ప్రస్తుతం మార్కెట్‌లో పలుకుతున్న వేరుశనగ ధర ఏమాత్రం గిట్టుబాటు కావడంలేదని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం వెంటనే మార్క్‌ఫెడ్ ద్వారా కనీస మద్దతు ధరతో కొనుగోలు చేసి వేరుశనగ రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. 280 బస్తాలు విక్రయానికి రాగా వాటి కనిష్ఠ ధర రూ.3,211, గరిష్ఠ ధర రూ.5,919, మధ్యస్త ధర రూ.5,469 పలికింది.

672 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

- కలెక్టర్ పి. రంజిత్ బాషా వెల్లడి

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా 672 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించేందు కు ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ పి. రంజిత్ బాషా వెల్లడించారు. బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో రెవెన్యూ సదస్సుల నిర్వహణపై ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, రైతు సంఘాల నాయకులు, మండల స్పెషల్ ఆఫీసర్లు రెవె న్యూ అధికారులతో కలెక్టర్ సమావేశమయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ స్థాయిలో భూసమస్యలను పరిష్కరించాలన్న ఉద్దేశంతో ఈ నెల 6వ తేదీ నుంచి జనవరి 8వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని భూసమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. రెవెన్యూ సదస్సుల నిర్వహణకు జాయింట్ కలెక్టర్ కోఆర్డినేటర్‌గా ఉంటారన్నారు. తహసీల్దార్, ఆర్‌ఐ, వీఆర్వో, మండ ల సర్వేయర్, ఎండోమెంట్, వక్ఫ్‌బోర్డు, రిజిస్ట్రేషన్, అటవీ శాఖల అధికారులతో టీమ్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండలానికి ఒక స్పెషల్ ఆఫీసర్, నియోజకవర్గానికి ఒక స్పెషల్ ఆఫీసర్‌ను నియమిస్తున్నామన్నారు. ప్రతి గ్రామ సభలో 5 కౌంటర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, రైతు సంఘాల నాయకులు, రెవెన్యూ సదస్సులో పాల్గొనేలా ప్రజలకు తెలియజేయాలని సూచించారు. ఈ సమావేశంలో జేసీ బి.నవ్య, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డీఆర్వో వెంకట నారాయణమ్మ, మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి, నాయకులు ప్రసాద్, సాయి ప్రదీప్, రామకృష్ణ, రామకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

మంత్రి సమీక్ష: రెవెన్యూ సదస్సులను విజయవంతగా నిర్వహించి భూసమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ, రిజిస్ట్రేషన్, స్టాంప్స్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. బుధవారం విజయవాడ నుంచి రెవెన్యూ సదస్సుల నిర్వహణపై జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంత్రి సమీక్ష నిర్వహించారు.

రాష్ట్ర స్థాయి అవార్డుకు పెంచికలపాడు రైతు ఎంపిక



జీవామృతం కలుపుతున్న రైతు మహేశ్వర రెడ్డి


గూడూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంలో రాష్ట్ర స్థాయి అవార్డుకు పెంచికలపాడు గ్రామానికి చెందిన రైతు బీరంరెడ్డి మహేశ్వరరెడ్డి ఎంపికైనట్లు మండల వ్యవసాయాధికారి శ్రీవర్ధన్‌రెడ్డి, ఏఈవో లక్ష్మీనారాయణ తెలిపారు. బుధవారం గూడూరు పట్టణంలోని వ్యవసాయ కార్యాలయంలో వారు మాట్లాడుతూ మహేశ్వరరెడ్డి ఐదేళ్లుగా ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పత్తి, వేరుశనగ, శనగ, కంది పంటలను సాగు చేసి అత్యుత్తమ దిగుబడి సాధించడంతో రాష్ట్ర స్థాయి ఉత్తమ రైతు అవార్డుకు ఎంపికైనట్లు వారు తెలిపారు.

అయ్యో.. దేవుడా..!

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు చిన్నారుల దుర్మరణం

అల్లారుముద్దుగా పెంచుకున్న కుమార్తె.. నిండా ఏడేళ్లు కూడా నిండని చిన్నారి. ఎంతో భవిష్యత్ ఉన్న ఆ చిన్నారి పాఠశాల ప్రహరీకి బలైంది. స్కూలు అయిపోయిందని ఇంటికి వెళ్దామని గోడ పక్కన ఉండగా ఒక్కసారిగా ఆ గోడ కూలి చిన్నారి మీద పడటంతో విద్యార్థిని మృతి చెందిన సంఘటన బుధవారం నందికొట్కూరు పట్టణంలో చోటు చేసుకుంది. అదేవిధంగా బేతంచెర్లలో మరో చిన్నారి ఆడుకుంటుండగా నాపరాయి మీదపడి మృతి చెందింది. అప్పటివరకు ముద్దుముద్దు మాటలతో అల్లరిచేసిన చిన్నారులు ఒక్కసారిగా ప్రాణాలను కోల్పోవడంతో తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు.

7లో



చిన్నారి షేక్ అస్తమహీన్



యామిని మృతదేహం

సరిదిద్దేవారెవరు?

షోకాజు నోటీసులు.. మెమోలకే పరిమితం 7

కర్నూలు కార్పొరేషన్ అధికారుల ఉదాసీనత

సమన్వయంతో పనిచేయండి

ఎస్పీ బిందుమాధవ్ 6

నట నారాయణ

కళ

- పౌరాణికంలో వడ్డె నారాయణ
- 60కి పైగా పాత్రలు..
- 40 ఏళ్లుగా మూడు రాష్ట్రాల్లో ప్రదర్శనలు


రామాంజనేయ యుద్ధం నాటకంలో రాముని వేషధారణలో వడ్డె నారాయణ

మంత్రాలయం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పౌరాణికంలో అందరినీ మెప్పించే నటన ఆయన సొంతం. సత్యహరిశ్చంద్ర నాటకమంటే ఆయన గుర్తుకు రావాల్సిందే. 40 ఏళ్లలో వివిధ నాటకాల్లో 60 పాత్రలు ప్రదర్శించి పేరుప్రఖ్యాతులు సంపాదించారు. ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక ప్రాంతాల్లో పౌరాణిక నాటక ప్రదర్శనలు చేసి పలువురి నుంచి మన్ననలు పొందారు. సత్య హరిశ్చంద్ర నాటకంలో దర్బార్ పాత్ర, అరణ్య, కాటిసీను, వారణాసి, కాటికాపరి వంటి పాత్రలు పోషించారు. మంత్రాలయంలో చిన్న లాడ్జీలను అద్దెకు తీసుకుని జీవిస్తున్న వడ్డె నారాయణ గతంలో ఆదోని పేపరు పేపరు మిల్లులో పని చేస్తుండేవారు. డిగ్రీ వరకు అభ్యసించి శుభకార్యాలు, ఆరాధనోత్సవాలు, పండుగలు, గ్రామ దేవర్లు వంటి వేడుకల్లో నాటక ప్రదర్శనలు ఇస్తున్నారు. నారాయణ సొంతంగా శ్రీరాఘవేంద్ర నాటక కళా సమితి ప్రధాన కార్యదర్శిగా 2007లో 30 మంది కళాకారులతో రిజిస్ట్రేషన్ చేసి తోటి కళాకారులకు ఆర్థికంగా ఆదుకుంటూ వారి కష్టాలు తీరుస్తూ ముందుకు వెళ్తున్నారు. రామాంజనేయ యుద్ధం నాటకంలో రాముడు, కురుక్షేత్రంలో కృష్ణుడు, యమ రావణ యుద్ధంలో నారదుడు, యముడు, చింతామణి నాటకంలో సుబ్బిశెట్టి, బలిదానంలో, పరిశుభ్రత, పచ్చదనం, శ్రమదానంలో సాంఘిక నాటకం, నిరక్షరాస్యత పొదుపు మహిళల అవగాహన, ఎయిడ్స్ నివారణ, హరిత మంత్రాలయం తీర్చిదిద్దేందుకు సాంఘిక సామాజిక నాటకాల ప్రదర్శన చేసి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. గురువు భోజప్ప, హార్మోనిస్టుగా పద్మనాభాచార్, రాఘవేంద్రాచార్ ఆధ్వర్యంలో కళానాటక రంగానికి కృషి చేస్తూ ప్రశంసలు పొందుతున్నారు.


పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులతో వడ్డె నారాయణ

● కళాకారులకు పింఛన్ సౌకర్యం కల్పించాలి



మారుతున్న కాలంలో పౌరాణిక నాటకానికి ప్రాముఖ్యత తగ్గుతున్నది. పౌరాణిక కళారంగానికి జిల్లా కేంద్రంలో స్థలం కేటాయించాలి. కళా ప్రాంగణం నిర్మించి కళలను ప్రోత్సహించాలి. కళాకారులకు పింఛన్ సౌకర్యం కల్పించేలా ప్రభుత్వం కృషి చేయాలి.
- వడ్డె నారాయణ

సమన్వయంతో పని చేయండి

● ఎస్పీ బిందుమాధవ్



కర్నూలు క్రైం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మహిళల భద్రత, రక్షణకు అన్ని శాఖలు కలిసి సమన్వయంతో పని చేయాలని ఎస్పీ జి. బిందుమాధవ్ పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో చైల్డ్‌వెల్ఫేర్ కమిటీ, డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్, ఐసీడీఎస్, విద్యాశాఖ, లేబర్ డిపార్టుమెంట్, అంగన్‌వాడీ టీచర్లు, వర్కర్లు, కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయ శాఖల సిబ్బందితో ఎస్పీ సమావేశం నిర్వహించారు. లైంగిక నేరాల నుంచి పిల్లలకు రక్షణ కల్పించాలనే కరపత్రాలు ఆవిష్కరించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ బాల్య వివాహాలు, చిన్న పిల్లలు భిక్షాటన ఎక్కడా కూడా కనిపించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మహిళలు, చిన్నారుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌ల గురించి బాలికలకు అవగాహన కల్పించాలన్నారు. మిస్సింగ్, పోక్సో కేసులు తగ్గుముఖం పట్టేలా కౌన్సెలింగ్ చేయాలన్నారు. బాలబాలికల రక్షణ సహాయం కోసం చైల్డ్‌లైన్ 1098, హెల్ప్‌లైన్ 181, పోలీస్ డయల్ 100కు గానీ సమాచారం అందించేలా అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ ఎస్.జుబేదాబేగం, డీఈఓ శామ్యూల్ పాల్, బాలల సంరక్షణ అధికారి శారద, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ డిపార్టుమెంట్ అధికారి నీలకంఠేశ్వర్, సీఐలు ప్రసాద్, శివశంకర్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

7న మెగా సమావేశం : కలెక్టర్



కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 7వ తేదీన జరిగే మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశాన్ని ఎలాంటి లోటుపాట్లు లేకుండా విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం పేరెంట్స్, టీచర్స్ మెగా సమావేశం ఏర్పాట్లపై ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంఈవోలతో కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రజాప్రతినిధులు అందరూ ఒకే చోట కార్యక్రమానికి హాజరు కాకుండా ఒక్కొక్కరు ఒక పాఠశాలలో కార్యక్రమానికి హాజరయ్యేలా చూడాలని డీఈవోను సూచించారు. ఈ కాన్ఫరెన్స్‌లో డీఈవో శామ్యూల్ పాల్ పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం


టీటీడీ చైర్మన్‌కు విరాళం అందజేస్తున్న గౌరు వెంకటరెడ్డి

కర్నూలు కల్చరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): తిరుమలలో నిర్వహిస్తున్న నిత్యాన్నదానానికి నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రూ.99వేలు విరాళం అందజేశారు. బుధవారం తిరుమలలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడును వారు మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం గౌరు వెంకటరెడ్డి అన్నదాన నిర్వహణకు సంబంధించిన రూ.99 వేల చెక్కును బీఆర్ నాయుడుకు అందించారు.

బ్యాంకర్లు రైతులకు రుణాలు ఇవ్వాలి

కలెక్టర్ రాజకుమారి


పీఎంఎస్‌బీవై కింద ప్రీమియం చెల్లించిన వ్యక్తి కుటుంబానికి ఇన్సూరెన్స్ చెక్కును అందజేస్తున్న కలెక్టర్

నంద్యాల కల్చరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రైతులకు విరివిగా రుణాలు మంజూరు చేసి సహకరించాలని కలెక్టర్ రాజకుమారి బ్యాంకర్లను కోరారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో రుణాల మంజూరుపై సంబంధిత అధికారులు, బ్యాంకర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ జిల్లాలో సీసీఆర్సీ కార్డులు మంజూరు చేసిన కౌలు రైతులకు రుణాలు ఇవ్వడంలో బ్యాంకర్లు విఫలమయ్యారని, అన్నం పెట్టే రైతులను ఆదుకోవడానికి బ్యాంకర్లు ఎందుకు ముందుకు రావడం లేదని ప్రశ్నించారు. ఆర్ఓఎఫ్ఆర్ భూములకు, సూక్ష్మసేద్య పరిశ్రమలకు, మహిళా సాధికారత ఉపాధికి, విద్యా రుణాలు, గృహ రుణాలు, చేనేత రుణాలు, తదితర ప్రాధాన్యత రంగాలకు కేటాయించిన ప్రతి లక్ష్యంలో 50 శాతం కూడా అధిగమించలేదని కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. స్వయం సహాయక సంఘాల రుణాలు మినహా ఇతర ఏ ప్రాధాన్యత రంగాలకు బ్యాంకర్ల నుంచి సహకారం లేదన్నారు. స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్‌లు రుణాల మంజూరులో తీవ్ర జాప్యం చేస్తూ ఎలాంటి సహకారం ఇవ్వడం లేదని అన్నారు. రుణాలు మాంజూరుకు బ్యాంకర్లు సహకరించాలన్నారు.

సీసీఐ కేంద్రాల వద్ద రైతుల రద్దీ

● రోజూ రూ. కోటిన్నర విలువ చేసే పత్తి కొనుగోళ్లు


పత్తి రైతులతో సెక్రటరీ సుందర్‌రాజు

కర్నూలు అగ్రికల్చర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రోజూ చిరుజల్లులు కురుస్తున్నందున కర్నూలు, నంద్యాల జిల్లాల రైతులు పత్తిని త్వరగా అమ్ముకునేందుకు పెంచికలపాడు సీసీఐ కేంద్రానికి పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. బుధవారం కోడుమూరు మార్కెట్ కమిటీ యార్డు సెక్రటరీ సుందర్‌రాజు, సూపర్‌వైజర్ శ్రీను సీసీఐ కేంద్రం వద్ద రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా కొనుగోలు చేసేందుకు చర్యలు చేపట్టారు. పెద్ద ఎత్తున పత్తిని విక్రయించేందుకు లారీలు, ట్రాక్టర్లలో రైతులు తరలివస్తుండటంతో వారికి ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా సీసీఐ కేంద్రం వద్ద త్వరితగతిన నమోదు ప్రక్రియ జరిగేందుకు సెక్రటరీ సుందర్‌రాజు, సూపర్‌వైజర్ శ్రీను అక్కడే ఉండి పనులు చేస్తున్నారు. ప్రతి రోజు రూ. కోటిన్నర విలువ చేసే పత్తిని సీసీఐ కేంద్రం అధికారులు కొనుగోలు చేసేలా శ్రద్ధ తీసుకుంటున్నామని, ఇటువంటి రద్దీ గతంలో ఎప్పుడూ లేదని వారు తెలిపారు. ప్రభుత్వం తేమ శాతం సడలింపు చేసినట్లు సమాచారం అందడంతో రైతులు పెద్ద ఎత్తున విక్రయానికి తరలివస్తున్నారని అన్నారు. 8 శాతం తేమ ఉంటే క్వింటానికి రూ.7,521, 12 శాతానికి పైబడి ఉంటే.. రూ.7వేల దాకా రైతులకు ఇస్తున్నట్లు సెక్రటరీ సుందర్‌రాజు తెలిపారు.

ఇసుక మస్కా..!

(5వ పేజీ తరువాయి)

అడుగంటుతున్న భూగర్భ జలాలు


ప్రధాన రోడ్డు పక్కనే నిల్వ చేసిన ఇసుక డంప్

ఇసుక మాఫియా రెచ్చిపోయి హంద్రీ నదిలోని ఇసుకను తోడేశారు. నదిలోని మంచినీటి పథకాల దగ్గర ఉన్న ఇసుకను కూడా తవ్వుకెళ్లారు. దీంతో నదిలోని భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. ఈ విషయంపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భూగర్భ జలాలు ఇంకిపోవడంతో రాబోయే రోజుల్లో కోడుమూరు ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు ఉన్నాయని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు వాపోతున్నారు. ఇదే పరిస్థితి వర్కూరు, గోరంట్ల, ముడుమలగుర్తి గ్రామ ప్రజలు కూడా ఎదుర్కోవాల్సి ఉంది.

ఆన్‌లైన్ చేసుకుంటేనే ఇసుక



ఇసుక కావాలంటే సచివాలయంలో వాహన నంబర్‌తో ఆన్‌లైన్ చేసుకొని రశీదు తీసుకొని రావాలి. హంద్రీనదిలో చూపించిన ప్రాంతంలో మాత్రమే ఇసుక తవ్వుకోవాలి. ప్రభుత్వ నిబంధనలు కచ్చితంగా పాటించాలి.
అజయ్‌భాస్కర్, పంచాయతీ కార్యదర్శి, కోడుమూరు.

అనుమతి లేకుంటే వాహనాలు సీజ్ చేస్తాం



అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే వాహనాలను సీజ్ చేస్తాం. అంతేగాకుండా రాత్రి వేళల్లో ఇసుకను తరలించడం ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధం. అక్రమంగా ఇసుకను తరలించాలని ప్రయత్నం చేస్తే సహించేది లేదు.
- తబ్రేజ్, సీఐ, కోడుమూరు

బడుల్లో పండుగ

- విద్యా ప్రమాణాల పెంపే లక్ష్యం
- ఈ నెల 7న మెగా పేరెంట్ల, టీచర్ల సమావేశం
- విద్యాపరమైన అంశాలపై చర్చ
- ఆటల పోటీలు, సహపంక్తి భోజనాలు
- పూర్వ విద్యార్థులకు ఆహ్వానం
- జిల్లాకు రూ.47 లక్షలు మంజూరు

ఆలూరు, డిసెంబరు 4, (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచడంతోపాటు సహృద్భావ వాతావరణం కల్పించేందుకు పాఠశాల విద్యాశాఖ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పాఠశాలల్లో ఉత్తమ విద్య అందించేందుకు, అభివృద్ధిలో అందరినీ భాగస్వాములను చేసేందుకు తల్లి దండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులను కలిపి ఒకే వేదికపైకి చేర్చింది. విద్యాపరమైన అంశాలను చర్చించడంతోపాటు ఆట పాటలు, శుభ తిథి పేరుతో సహపంక్తి భోజనాలు, పిల్ల ప్రగతి నివేదికలు అందజేయనున్నారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆదేశాల మేరకు శుభతిథి పేరుతో ఈ నెల 7వ తేదీన మెగా పేరెంట్, టీచర్స్ సమావేశాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు విద్యాశాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు విద్యారంగంలో వస్తున్న అనేక సంస్కరణలను పరిశీలించిన రాష్ట్ర ప్రభుత్వం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠశాలల మధ్య సంబంధాలను బలపరచడానికి శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ పాఠశాలలను మరింత అభివృద్ధి చేసి 2047 నాటికల్లా వికసిత ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దాలని సంకల్పించింది. దీనిలో భాగంగానే జిల్లాలోని 1485 ప్రభుత్వం పాఠశాలల్లో ఈ నెల 7వ తేదీన మెగా పేరెంట్, టీచర్ మీటింగ్ సమావేశాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు పాఠశాల విద్యాశాఖ అన్ని రకాల ఏర్పాట్లు చేస్తోంది. దీని కోసంగా రూ.47 లక్షల నిధులు కూడా ప్రభుత్వం విడుదల చేసింది. పది మంది పిల్లలు ఉన్న బడులకు రూ.వెయ్యి 300 నుంచి 200 మంది పిల్లలు ఉన్న రూ. 5 వేలు ఇలా సంఖ్యలను బట్టి ఆయా పాఠశాలలకు నిధులను కేటాయించారు. జిల్లా విద్యాశాఖ అధికారులు, సమగ్ర శిక్ష అధికారులు ఆ కార్యక్రమంలో పర్యవేక్షించనున్నారు. వారం రోజులు ముందుగానే అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని ఇప్పటికే కలెక్టర్ అధికార్లకు ఆదేశాలు ఇవ్వడంతో జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో ఏర్పాట్లు జరుగుతున్నాయి. తల్లిదండ్రుల కమిటీల సమావేశాలు కొత్త కానప్పటికీ ఈసారి మాత్రం పలు ప్రత్యేకతలు రూపొందించారు. ఎన్నడూ లేని విధంగా పిల్లల సంఖ్యను బట్టి ఆయా పాఠశాలలకు నిధుల కేటాయింపులు చేశారు. పూర్వ విద్యార్థులు, దాతలు, ఉపాధ్యాయులు ఎవరి స్థాయిలో వారు మరికొంత నిధులు సేకరించి కార్యక్రమాలు చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. విద్యాశాఖ మార్గదర్శకాల ప్రకారం ఆహ్వానం కమిటీ, నిర్వహణ కమిటీ, బడ్జెట్ కమిటీ, బడి సుందరీకరణ కమిటీ, పర్యావరణ పరిరక్షణ కమిటీ, నిర్వహణ కమిటీ, స్టేజీ నిర్వహణ వంటి కమిటీలను ఏర్పాటు చేయనున్నారు.

● పిల్లల ప్రగతిపై నివేదికలు

పిల్లల ప్రగతికి సంబంధించిన పూర్తి స్థాయి నివేదికలను ఈ సమావేశంలోనే తల్లిదండ్రులకు అందజేయనున్నారు. ప్రోగ్రెస్ కార్డుల్లో మార్పులు, హాజరుతోపాటు ఆటలు, సాంస్కృతిక నిర్ధారణ పరీక్షల వివరాలు పొందుపరుస్తున్నారు. విద్యార్థులు ఇళ్ల వద్ద సెల్‌ఫోన్, ట్యాబ్‌లు అధికంగా వినియోగించకుండా తల్లిదండ్రులకు అవగాహన కల్పించడంతోపాటు తల్లిదండ్రులకు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తారు. పూర్వ విద్యార్థులు, ప్రజాప్రతినిధులను ప్రత్యేకంగా ఆహ్వానించి కార్యక్రమం విజయవంతం చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. అలాగే సమావేశానికి సంబంధించి మీటింగ్ షెడ్యూలు కూడా విడుదల చేశారు. ఉదయం 9 నుంచి 12.30 గంటల వరకు వివిధ కార్యక్రమాల అనంతరం సహపంక్తి భోజనం చేస్తారు.

● ప్రతిష్టాత్మకంగా మెగా పేరెంట్స్ కమిటీ నిర్వహణ



జిల్లా మెగా పేరెంట్, టీచర్ మీటింగ్‌ను డిసెంబరు 7న జిల్లాలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నాం. విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు అందిచడంతోపాటు పాఠశాలల అభివృద్ధి చేస్తున్న, చేపట్టబోవు కార్యక్రమాలపై తల్లిదండ్రులతోపాటు పాఠశాలల అభివృద్ధిలో ప్రజలను భాగస్వాములను చేయడం, పది పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయడం, సైబర్ నేరాలపై అవగాహన, విద్యార్థుల పురోగతి. జరిగిన పరీక్షల్లో వచ్చిన మార్కుల గూర్చి ఈ మెగా పేరెంట్స్ మీటింగ్ ప్రత్యేక ఉద్యేశం. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు సూచనలు, సలహాలతో కార్యక్రమం విజయవంతం చేస్తాం.
- శ్యామ్యూల్ పాల్, జిల్లా విద్యాశాఖాధికారి



ఆలూరు ప్రభుత్వ పాఠశాల

'స్వచ్ఛ' సేవకులు

- సమాజ సేవ చేస్తూ ఉపాధి పొందుతున్న యువకులు
- నంద్యాల-గిద్దలూరు నల్లమల రహదారిలో వ్యర్థాల సేకరణ
- ప్లాస్టిక్ రహిత నల్లమల కోసం కృషి
- వన్యప్రాణుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు

శిరివెళ్ల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వన్యప్రాణులు, విభిన్న వృక్షజాతులకు నెలవైన నల్లమల అటవీ ప్రాంతంలో ప్లాస్టిక్ వస్తువుల వినియోగంపై అటవీశాఖ నిషేధం విధించింది. ఒకసారి వాడి పారేసే ప్లాస్టిక్ వస్తువుల వ్యర్థాలతో వన్యప్రాణుల మనుగడకు ముప్పు వాటిల్లుతోంది. దీంతో ప్లాస్టిక్ రహిత నల్లమలగా తీర్చిదిద్దేందుకు స్వచ్ఛ సేవకులను నియమించింది. నంద్యాల-గిద్దలూరు ప్రధాన రహదారిలో నంద్యాల జిల్లా మహానంది మండలం గాజులపల్లె నుంచి ప్రకాశం జిల్లా సరిహద్దుల్లోని దిగువమెట్ట ప్రాంతం వరకు దట్టమైన నల్లమల అటవీ ప్రాంతంలో ఈ స్వచ్ఛ సేవకులు ప్రతిరోజూ రహదారి వెంట పర్యటిస్తూ ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరిస్తున్నారు. పచ్చర్ల అటవీ సెక్షన్ పరిధిలో పలు గ్రామాలకు చెందిన 13 మంది యువకులు ఓ వైపు సమాజసేవలో భాగంగా బాధ్యతగా పని చేస్తూనే.. మరో వైపు ఉపాధి సైతం పొందుతున్నారు. రహదారి వెంట, అటవీ ప్రాంతంలో ప్రయాణికులు విసిరిపడేసే ప్లాస్టిక్ కవర్లు, వాటర్ బాటిళ్లను ఏరివేసి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రదేశంలో పోగు చేస్తున్నారు. పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్న స్వచ్ఛ సేవకులకు అటవీశాఖ నెలకు రూ.9 వేల చొప్పున గౌరవ వేతనం చెల్లిస్తోంది.


నల్లమలలో సేకరించిన ప్లాస్టిక్ వ్యర్థాలు

● పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత :



పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉంది. స్వచ్ఛ సేవకుడిగా అటవీ ప్రాంతంలోని ప్లాస్టిక్ వ్యర్థాలను ఏరివేస్తూ ఉపాధి పొందుతున్నాను. వ్యర్థాల వల్ల వన్యప్రాణులకు కలిగే ముప్పును ప్రయాణికులకు తెలియజేస్తున్నాం.
- రంగస్వామి, పచ్చర్ల



నల్లమలలో ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరిస్తున్న స్వచ్ఛ సేవకులు

● అవగాహన కల్పిస్తున్నాం



రహదారిలో ప్రయాణించే వాహనదారులు, ప్రకృతి అందాలను తిలకించేందుకు వచ్చే వారికి ప్లాస్టిక్ రహిత నల్లమల కోసం చేపట్టిన ప్రణాళికపై అటవీశాఖ సిబ్బందితో కలిసి అవగాహన కల్పిస్తున్నాం. అటవీ ప్రాంతంలో ఎక్కడబడితే అక్కడ ప్లాస్టిక్ వ్యర్థాలను వేయకుండా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన చెత్త కుండీల్లోనే వేసేలా చర్యలు తీసుకుంటున్నాం.
- వసంత్ కుమార్, మహదేవపురం

పాఠశాల ప్రహరీ కూలి

విద్యార్థిని మృతి



విద్యార్థిని మృతదేహం వద్ద విలపిస్తున్న తల్లిదండ్రులు

నందికొట్కూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): చక్కగా స్కూల్ డ్రెస్ ధరించి, భుజాన బ్యాగ్‌తో తోటి చిన్నారులతో ఆడుతూపాడుతూ హాయిగా పాఠశాలకు వెళ్లిన ఆ చిన్నారికి అదే చివరి రోజైంది. పాఠశాల ప్రహరీ రూపంలో ఆరేళ్ల చిన్నారిని మృత్యువు కబళించింది. పాఠశాల ప్రహరీ కూలి రెండో తరగతి చదువుతున్న ఓ చిన్నారి మృతి చెందిన విషాద సంఘటన నందికొట్కూరు పట్టణంలో బుధవారం చోటు చేసుకుంది. ఇదే సంఘటనలో మరో ఇద్దరు చిన్నారులు కూడా గాయపడ్డారు. ఇందుకు సంబంధించిన వివరాలు... నందికొట్కూరు పట్టణంలోని కాలేజీ రోడ్డులో జీవిస్తున్న షేక్ శాలుబాషా, షేక్ రుక్సానాలకు షేక్ అస్తమహీన్(6)తో పాటు కుమారుడు సంతానం. చిన్నారి అస్తమహీన్ పట్టణంలోని విద్యానగర్‌లో ఉన్న ఎంపీపీ ఉర్దూమీడియం పాఠశాలలో 2వ తరగతి చదువుతోంది. రోజులాగే అస్తమహీన్ పాఠశాలకు వెళ్లింది. సాయంత్రం స్కూల్ వదిలాక ఇంటికి వచ్చే సమయంలో స్కూల్ గేటును ఆయా మూస్తుండగా గోడకు ఆనుకుని ముగ్గురు విద్యార్థులు నిలిచి ఉన్నారు. ఆయా గేటు వేస్తున్న తరుణంలో గోడ ఒక్కసారిగా కూలి విద్యార్థులపై పడింది. దీంతో అక్కడికక్కడే విద్యార్థిని అస్తమహీన్ మృతి చెందగా, మరో ఇద్దరు విద్యార్థినులు తబస్సుం, షేక్ అజీద్ గాయాలపాలయ్యారు. ఘటన జరిగిన వెంటనే ఆయా నూర్జహాన్ అక్కడి నుంచి భయంతో పరారైంది. స్కూల్ ఉర్దూ టీచర్ షేక్ సబిహా విషయాన్ని విద్యార్థుల తల్లిదండ్రులకు, పోలీసులకు తెలియజేశారు. గాయాలపాలైన విద్యార్థులను నందికొట్కూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి తండ్రి పట్టణంలో పెయింటర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. కుమార్తె మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు.

- ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, వైస్ చైర్మన్ రబ్బాని, కౌన్సిలర్లు జాకీర్, నాయకులు చేరుకొని వివరాలు తెలుసుకు న్నారు. నందికొట్కూరు ప్రభుత్వ ఆసుపత్రిలో విద్యార్థిని తల్లిదండ్రులను పరామర్శించారు. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి విద్యార్థిని తల్లిదండ్రులకు న్యాయం జరిగేలా చూస్తామని ఎమ్మెల్యే భరోసా తెలిపారు. మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి కూడా సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

నాపరాయి పడి చిన్నారి దుర్మరణం



చిన్నారి యామిని మృతదేహం

బేతంచెర్ల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): బేతంచెర్ల-డోన్ రహదారిలో ఉన్న నాపరాళ్ల పాలిష్ ఫ్యాక్టరీ ఆవరణలో బండలు పడి బుధవారం ఓ చిన్నారి మృతి చెందింది. కొలుములపల్లె గ్రామానికి చెందిన మద్దయ్య, సువర్ణ దంపతులు నాపరాళ్ల పాలిష్ ఫ్యాక్టరీలో పని చేయడానికి వెళ్లగా వారితో పాటు తమ కుమార్తె యామిని(5)ని కూడా వెంట తీసుకెళ్లారు. తల్లిదండ్రులు పనుల్లో నిమగ్నమై ఉండగా.. ఆడుకుంటున్న యామినిపై నిలిపి ఉంచిన నాపరాళ్లు మీద పడి అక్కడికక్కడే దుర్మరణం చెందింది. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు సంఘటనా స్థలానికి వెళ్లి రోదించిన తీరు కలచివేసింది. బేతంచెర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డీపీఆర్‌సీలో రెండు రోజుల శిక్షణ

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్, నిధులతో ఏపీ గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై రెండు రోజులపాటు శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం ప్రిన్సిపాల్ జి. నాసరరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5,6 తేదీలలో డీపీఆర్‌సీలో జరిగే శిక్షణకు ఈఓఆర్‌డీలు/ పంచాయతీ కార్యదర్శి, ఎంపీహెచ్‌ఈవో, ఏపీ ఆర్‌డబ్ల్యూఎస్, పీఆర్ ఏఈ, ఏపీఎం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శాఖకు ఒక్కరు చొప్పున మండలానికి ఆరుగురు శిక్షణకు హాజరుకావాలన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారందరూ ఈ నెల 10 నుంచి 13 వరకు మండలాలలో రెండు రోజులు సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, మండల లైవ్ డిపార్ట్‌మెంట్ అధికారులు, సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇస్తారన్నారు.

బహిరంగ ధరకు మించి కొనుగోలు

కర్నూలు అగ్రికల్చర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో కంది పంటలను సాగు చేసిన రైతులకు అదృష్టం వరించింది. కేంద్ర ప్రభుత్వం కందులకు క్వింటం రూ.7,600 మద్దతు ధరను ప్రకటించింది. అయితే బహిరంగ మార్కెట్‌లో క్వింటం ధర రూ.9,400 పోతుండటంతో అన్నదాతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రైతుల సంతోషాన్ని మరింత ఎక్కువ చేసేందు కోసం రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కందులను మార్కెట్‌లో లభించే ధర కంటే ఎక్కువ ధరకు కొనుగోలు చేసేందుకు నిర్ణయించినట్లు మార్క్‌ఫెడ్ అధికారులు తెలిపారు. మార్క్‌ఫెడ్ ద్వారా ఉమ్మడి జిల్లాలో వంద మెట్రిక్ టన్నులను కొనుగోలు చేసే అవకాశం దక్కింది. కేంద్ర ప్రభుత్వం నాఫెడ్ ద్వారా ఉమ్మడి జిల్లాలో 100 మెట్రిక్ టన్నులను రైతుల నుంచి కొనుగోలు తీసుకోవాలని, అవసరమైన ఏర్పాట్లు చేయాలని జారీ చేసిన ఉత్తర్వులు మార్కెట్ ఫెడ్ కార్యాలయానికి చేరాయి. బుధవారం స్థానిక కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆధ్వర్యంలో జిల్లా ప్రొక్యూర్మెంట్ సమావేశాన్ని నిర్వహిస్తున్నారు. ఎక్కడెక్కడ జిల్లాలో కొనుగోలు కేంద్రాల్లో ఏర్పాటు చేయాలో ప్రాథమిక వ్యవసాయ సంఘాలతో పాటు డీసీఎంఎస్ ద్వారా కొనుగోలు ఏర్పాటు చేసి రైతుల నుంచి రూ.లక్ష మేరకు వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

రేపు కళా ఉత్సవ్ పోటీలు

కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తాండ్రపాడు డైట్ కళాశాలలో ఈ నెల 6వ తేదీన జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్, కేంద్రీయ నవోదయ రెసిడెన్షియల్ పాఠశాలల్లో చదువుతున్న 9 నుంచి 12వ తరగతుల విద్యార్థులకు జిల్లా స్థాయిలో కళా ఉత్సవ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు డైట్ ప్రిన్సిపాల్ జనార్దన్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గాత్ర సంగీతం, వోకల్ మ్యూజిక్ బృందం, వాయిద్య సంగీతం, డ్యాన్స్, ఏకపాత్రాభినయం, డ్రామా, విజువల్ ఆర్ట్స్, ఎడిషనల్ స్టోరీ స్పెల్లింగ్ వంటి పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయిలో ఎంపికైన విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్న విద్యార్థులు లెక్చరర్ ప్రభాకర్ బాబును 8985126758 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పుల్లారెడ్డి వీధికి చెందిన ఓ విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు ఆళ్లగడ్డ పోలీసులు బుధవారం తెలిపారు. పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థినిని పాఠశాలకు వెళ్లమని తల్లి మందలించడంతో ఇంట్లో చున్నీతో ఆత్మహత్యాయత్నం చేసిందన్నారు. బాధితురాలిని ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు, మెరుగైన వైద్యం నిమిత్తం కుటుంబసభ్యులు నంద్యాలలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారన్నారు. బాధితురాలి తల్లిదండ్రులు ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేస్తామని పట్టణ పోలీసులు వెల్లడించారు.

సరిదిద్దేవారెవరు?



- షోకాజు నోటీసులు.. మెమోలకే పరిమితం
- ఉదాసీనంగా వ్యవహరిస్తున్న అధికారులు

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ పరిధిలో కొందరు అధికారులు, ఉద్యోగులు ఇష్టానుసారంగా విధులు నిర్వహిస్తున్నారు. వాళ్లను చక్కదిద్దేవారే లేరనే విమర్శలు వినిపిస్తున్నాయి. కార్యాలయంలోని ప్రతి విభాగాన్ని ప్రక్షాళన చేయాలని స్వయంగా రాష్ట్ర మంత్రి టీజీ భరత్ ప్రతి సమావేశంలో చెబుతూనే ఉన్నారు. ఈ దుస్థితి అంతా ఓ ఉన్నతాధికారి నిర్వాకమే అనే ఆరోపణలు వస్తున్నాయి. రాష్ట్ర మంత్రి, ఎమ్మెల్యేలు, కమిషనర్‌కు తెలిసినా కూడా ఏమి చేయలేని పరిస్థితుల్లో ఉన్నారనే ఆరోపణలు ఉన్నాయి. నగర పాలక సంస్థలోని ఓ విభాగంలో విధుల పట్ల అధికారులు నిర్లక్ష్యంగా ఉన్నారనే విమర్శలు ఉన్నాయి. ఇట్లా నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులు, ఉద్యోగులకు ఉన్నతాధికారులు షోకాజు నోటీసులు, మెమోలు జారీ చేశారు. ఇప్పటి వరకు షోకాజు నోటీసులు, మోమోలు తీసుకున్న వారెవ్వరూ వివరణ ఇవ్వలేదు. అలాంటి వారిపై శాఖాపరమైన చర్యలు ఏమైనా తీసుకుంటున్నారా.. లేదా అనే విషయంలో స్పష్టత లేదు. దీంతో మిగిలిన వారు కూడ తప్పులు చేసుకుంటు వెళ్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఉన్నతాధికారులు కేవలం షోకాజు నోటీసులు, మోమోలు ఇస్తారు...అంతే దాని పైన ఎలాంటి చర్యలు ఉండనవి ప్రతి ఒక్కరికీ అర్థమైంది.

ఆరోపణలు ఎన్నో

నగర పాలక సంస్థలోని ఓ విభాగంలో కాంట్రాక్టరు ఇష్టానుసారంగా పనులు చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. దీంతో ఉన్నతాధికారి ఆ కాంట్రాక్టర్‌కు సంబంధించిన అధికారులు, ఉద్యోగులకు మెమోలు జారీ చేసారు. ఆరోపణలపై వెంటనే వివరణ ఇవ్వాలని సుమారు 12 మందికి మెమో జారీ చేశారు. అంతే కాకుండా ముగ్గురు కింది స్థాయి ఉద్యోగులు విధుల్లో నిర్లక్ష్యం వహించినందుకు వారికి కూడా షోకాజు నోటీసులు జారీ చేశారు. మరో ఆప్కాస్ ఉద్యోగి సచివాలయంలో అసభ్యకరంగా ప్రవర్తించినందుకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో మెమోలు, షోకాజు నోటీసులు తీసుకున్న వారందరూ ఇప్పటి వరకు ఎలాంటి వివరణ ఇచ్చారో బయటికి పొక్కకుండా జాగ్రత్త పడుతున్నారు.

ఇంకేమైనా సర్దుకున్నారా..?

వివిధ ఆరోపణలు ఎదుర్కొంటున్న వారంతా మెమోలు, నోటీసులకు వివరణ ఇచ్చారా... లేదా వేరే విధంగా సర్దుకున్నారా అనే విషయంపై నగర పాలక కార్యాలయంలో గుసగుసలాడుతున్నారు. ప్రధానంగా ఓ ఉన్నతాధికారి ఇదంతా కావాలనే చేస్తున్నారని, మిగతా అధికారులు, ఉద్యోగుల వద్ద భారీ మొత్తంలో నగదు వసూలు చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. వసూళ్లంతా ఆ అధికారి పక్కనే ఉన్న ఓ వ్యక్తి కనుసన్నల్లో నడుస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇదంతా రాష్ట్ర మంత్రి, ఎమ్మెల్యేలు, కమిషనర్‌కు తెలిసిన కూడా ఏమీ చేయలేని పరిస్థితుల్లో ఉన్నారు. ఇలాంటప్పుడు నగర పాలక సంస్థలో ప్రక్షాళన ఎవరు చేస్తారని కొందరు ప్రశ్నిస్తున్నారు.

మెరుగైన వైద్యం అందించండి

- పాత భవనంలో చికిత్స అందించడంపై ఎమ్మెల్యే ఆగ్రహం



వైద్యులతో సమస్యలను అడిగి తెలుసుకుంటున్న గౌరు చరితారెడ్డి

ఓర్వకల్లు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. బుధవారం ఓర్వకల్లులోని సామాజిక ఆరోగ్య కేంద్ర అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. పాత భవనం వదిలేసి కొత్త భవనంలో రోగులకు వైద్య సేవలందించాలని ఆదేశించినా ఎందుకు చర్యలు తీసుకోలేదని ఎమ్మెల్యే మండిపడ్డారు. పాతబడిన గదులను ఆమె పరిశీలించారు. నూతనంగా నిర్మించిన ఆసుపత్రి గదులను పరిశీలించారు. త్వరలోనే కొత్త భవనంలో వైద్య సేవలు అందించాలని మెడికల్ ఆఫీసర్‌ను ఆదేశించారు. అనంతరం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఆసుపత్రి కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు సీహెచ్‌సీలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. ఆసుపత్రిలో 24 గంటల్లో వైద్యసేవలు అందించాలని, విద్యుత్ సరఫరా అయ్యే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామీణ రోగులకు అత్యవసర చికిత్స నిమిత్తం అల్ట్రాసౌండ్ మిషన్‌ను ఎక్స్‌రే పరికరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఆసుపత్రికి ఇన్వర్టర్ సదుపాయం, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఆవరణలో విద్యుద్దీపాల ఏర్పాటు, తొలగించిన అంబు లెన్స్‌ను పునఃప్రారంభించాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో శ్రీనివాసులు, మెడికల్ ఆఫీసర్ ఎస్ఐ సునీల్ కుమార్, మంజుల, వైద్యులు అశ్విన్, శ్రీకాంత్, దాదాబాషా, నవ్యతేజ పంచాయతీ కార్యదర్శి నాగరాజు, రీసర్వే డీటీ షర్మిలారెడ్డి, గ్రామ నాయకులు రాంభూపాల్ రెడ్డి సుధాకర్‌రావు, అన్వర్ బాషా వేణుగోపాల్ రెడ్డి, ఏసేపు, అబ్దుల్లా పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షల్లో ఒకరు డీబార్

కర్నూలు అర్బన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): డిగ్రీ 5వ సెమిస్టర్ పరీక్షలో ఒకరు డీబార్ అయ్యారని పరీక్షల విభాగం కంట్రోలర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం రాయలసీమ యూనివర్సిటీలోని 64 పరీక్షా కేంద్రాల్లో 4,219 మంది దరఖాస్తు చేసుకోగా 3,892 మంది పరీక్షలకు హాజరయ్యారు. నగరంలోని శ్రీసాయి కృష్ణ డిగ్రీ కళాశాలలో పరీక్షలు జరుగుతున్న తీరును ఇన్‌చార్జి ఉపకులపతి ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ పరిశీలించారు.

యాగంటి క్షేత్రంలో గుంతకల్లు వాసి మృతి

బనగానపల్లె, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): యాగంటి క్షేత్రంలో అనంతపురం జిల్లా గుంతకల్లు మండలం పాతకొచ్చెర్వుకు చెందిన ఓ యువకుడు మృతి చెందాడు. పాతకొచ్చెర్వుకు చెందిన బోయ సురేంద్ర (27) తన స్నేహితులతో కలిసి యాగంటి క్షేత్రానికి దర్శనానికి వచ్చాడు. కోనేరులో స్నానమాచరించిన తర్వాత బోయ సురేంద్ర ఆలయ ఆవరణలో కుప్పకూలాడు. స్నేహితులు బనగానపల్లె వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ దుగ్గిరెడ్డి తెలిపారు.

రైల్వేలో ప్రశాంతంగా పోలింగ్ ప్రక్రియ

- మొదటి రోజు 50 శాతం నమోదు

కర్నూలు రూరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): కర్నూలు సిటీ రైల్వేస్టేషన్‌లో గుర్తింపు సంఘం ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ ప్రక్రియ బుధవారం ప్రశాంతంగా జరిగింది. కర్నూలు రైల్వేస్టేషన్ పరిధిలో బోగోలు, వెల్దుర్తి, ఉల్లిందకొండ, దూపాడు, మానవపాడు స్టేషన్‌లు వస్తాయి. ఈస్టేషన్‌లలో పని చేస్తున్న రైల్వే ఉద్యోగులు, కార్మికులు కర్నూలు రైల్వేస్టేషన్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రానికి వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం 452 మంది ఓటర్లు ఉండగా బుధవారం తొలి రోజు దాదాపు 50 శాతం పోలింగ్ నమోదైనట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు పోలింగ్ ప్రక్రియ కొనసాగింది. నేడు కూడా పోలింగ్ ప్రక్రియ కొనసాగనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. రన్నింగ్ ఉద్యోగులు ఓటు వేసేందుకు రేపు అవకాశం కల్పించారు. ఈ నెల 12న కౌంటింగ్ ప్రక్రియ చేపట్టనున్నట్లు వివరించారు. దేశవ్యాప్తంగా రైల్వే శాఖలో ఐదేళ్లకోసారి జరిగే గుర్తింపు సంఘం ఎన్నికల కోసం ఐదు కార్మిక సంఘాలు పోటీలో నిలిచాయి. అందులో ప్రధానంగా సౌత్‌సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్, సౌత్‌సెంట్రల్ రైల్వే నేషనల్ మజ్దూర్ యూనియన్ మధ్య తీవ్ర పోటీ నెలకొంది. హైదరాబాద్ నుంచి రైల్వే అధికారులు ఎన్నికల అధికారులుగా వ్యవహరించి పోలింగ్ ప్రక్రియ కొనసాగిస్తున్నారు.



రైల్వేస్టేషన్‌లో పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన ఓటర్లు

నంద్యాల జీజీహెచ్‌లో డ్యూటీ రోస్టర్‌ను సవరించాలి

- ఏపీ గవర్నమెంట్ నర్సెస్ అసోసియేషన్



జిల్లా కార్యవర్గంలో పాల్గొన్న సభ్యులు

కర్నూలు హాస్పిటల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నంద్యాల గవర్నమెంటు జనరల్ హాస్పిటల్‌లో నర్సింగ్ సిబ్బంది డ్యూటీ రోస్టర్‌లో అవకతవకలు జరిగాయని, వెంటనే సవరించాలని ఉమ్మడి జిల్లా ఏపీ గవర్నమెంట్ నర్సెస్ అసోసియేషన్ కోరింది. బుధవారం సాయంత్రం కర్నూలు జీజీహెచ్‌లో జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షురాలు ఎం.లీలావతి ఆధ్వర్యంలో జరిగింది. కర్నూలులో మెటర్నిటీ హాస్పిటల్‌ను ఏర్పాటు చేయాలని అసోసియేషన్ భవనాన్ని పునరుద్ధరించాలని నర్సులకు సిక్ రూం ఏర్పాటు చేయాలని సమావేశంలో సభ్యులు కోరారు. కర్నూలు జీజీహెచ్‌లో కూడా ఆరోగ్యం బాగాలేని సిక్ అయిన నర్సింగ్ సిబ్బందికి తేలిగ్గా ఉండే డ్యూటీలు వేయాలని కోరారు. సమావేశంలో అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షురాలు జి. శాంతి భవాని, సెక్రటరీ సి.బంగారి, కోశాధికారి ఎస్.లక్ష్మీనరసమ్మ, ఈసీ సభ్యులు సోమేశ్వరి, యూఎం శాంతిలత, జే.ఉమారాణి, డి.కృష్ణవేణి, ఎ.ఉమాదేవి పాల్గొన్నారు.

10 నుంచి మైనార్టీ అభ్యర్థులకు

డీఎస్సీ ఉచిత శిక్షణ

నంద్యాల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ ఆఫ్ మైనార్టీస్ అమరావతి, రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్ ఆదేశాల మేరకు నంద్యాలలో ఈ నెల 10నుంచి రెండు నెలలపాటు డీఎస్సీకి సిద్ధమవుతున్న మైనార్టీ అభ్యర్థులకు ఉచిత శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జోయా కోచింగ్ డైరెక్టర్ అబ్దుల్ అజీజ్, రాజేశ్వరి కోచింగ్ డైరెక్టర్ గంగాధర్ బుధవారం తెలిపారు. మైనార్టీలోని ముస్లిం, క్రిస్టియన్ అభ్యర్థులు సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ ఆఫ్ మైనార్టీస్ అమరావతి (సీఈడీఎం) దరఖాస్తు పత్రంతో సంబంధిత విద్యార్హత పత్రాలను జోడించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నంద్యాలలోని ముల్లాన్‌పేటలో ఉన్న జియా ఉర్దూ కోచింగ్, శ్రీనివాస సెంటర్‌లో ఉన్న రాజేశ్వరి కోచింగ్ సెంటర్‌లో దరఖాస్తులు అందుబాటులో ఉన్నాయన్నారు. డిసెంబరు 10వ తేది సాయంత్రం 5గంటల్లోపు దరఖాస్తులు సమర్పించాలని, రెండు నెలల డీఎస్సీ ఉచిత శిక్షణాతరగతుల్లో ఎస్జీటీ అభ్యర్థులతోపాటు స్కూల్ అసిస్టెంట్ మైనార్టీ అభ్యర్థులకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. నూతన సిలబస్ ప్రకారం అభ్యర్థులకు మెటీరియల్ అందజేస్తామన్నారు. మరిన్ని వివరాలకు 9059289076, 9110304693 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

గొలుసు దొంగల హల్‌చల్

కర్నూలు క్రైం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నగరంలో గొలుసు దొంగలు చెలరేగిపోయారు. బుధవారం తెల్లవారుజామున నిర్మానుష్యంగా ఉన్న కాలనీల్లో వృద్ధులే లక్ష్యంగా రెండు చోట్ల చైన్ స్నాచింగ్ చేశారు.

బాలాజీనగర్‌లో:
తాలుకా పోలీస్‌స్టేషన్ పరిధిలోని బాలాజీనగర్‌లో బుధవారం తెల్లవారు జామున 5.30 గంటల ప్రాంతంలో నారాయణమ్మ అనే వృద్ధురాలు తన ఇంటి ముందు నిల్చుని ఉండగా.. నడుచుకుంటూ వచ్చిన ఓ యువకుడు ఆమె మెడలోని గొలుసును తెంపుకుని పరారయ్యాడు. అప్పటికే సమీపంలో ఉన్న మరో యువకుని ద్విచక్ర వాహనంపై ఎక్కి ఉడాయించాడు. అపహరణకు గురైన గొలుసు నాలుగున్నర తులాలు ఉంటుందని ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది.

నాగిరెడ్డి రెవెన్యూకాలనీలో...
బాలాజీనగర్‌లో స్నాచింగ్ చేసిన దుండగులు 6:30 గంటలకు నాగిరెడ్డి రెవెన్యూ కాలనీలో స్నాచింగ్ చేశారు. రిటైర్డ్ ప్రిన్సిపాల్ చెంచమ్మ పాల దుకాణం నుంచి పాల ప్యాకెట్లు తీసుకుని వెళ్తుండగా.. ఇద్దరు బైక్‌పై వచ్చి ఆమె మెడలో నుంచి గొలుసు తెంపుకుని ఉడాయించారు. ఆయా స్టేషన్ల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ఎమ్మెల్యే గౌరు చరితకు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

కల్లూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ పరిధిలో పనిచేస్తున్న ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.శ్రీనివాసులు కోరారు. బుధవారం పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితని ఆమె నివాసంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా పని చేస్తున్న కార్మికులకు వేతనాలు పెంచడం లేదన్నారు. కూటమి ప్రభుత్వమైనా చొరవ తీసుకుని జీతాలు పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి జే.రమేష్, జిల్లా అధ్యక్షుడు ఎస్.మనోహర్, నగర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, కాశపోగు జ్ఞానమ్మ, యాసిన్ బేగ్ పాల్గొన్నారు.

కొణిజేటి రోశయ్య అపర చాణక్యుడు



రోశయ్య చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కర్నూలు అర్బన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం కొణిజేటి రోశయ్య అపర చాణక్యుడని కాంగ్రెస్ నాయకులు కొనియాడారు. బుధవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రోశయ్య వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ ఎం. సుధాకర్ బాబు, కే.వెంకటరెడ్డి, ఐఎన్‌టీ యూసీ జిల్లా అధ్యక్షులు బి.బతుకన్న మాట్లాడుతూ రోశయ్య అంచ లంచెలుగా ఎదిగి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీగా, రాష్ట్ర మంత్రిగా, సీఎంగా, గవర్నర్‌గా పని చేసిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. కార్యక్రమంలో నాయకులు షేక్ ఖాజాహుస్సేన్, సత్యనారాయణ గుప్త, ప్రతాప్, ప్రమీల పాల్గొన్నారు.

వర్సిటీ హాస్టళ్లలో పరిశుభ్రతే లక్ష్యం

కర్నూలు అర్బన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివ ర్సిటీలోని హాస్టళ్లలో పరిశుభ్రతే లక్ష్యంగా పని చేయాలని వార్డెన్లకు ఇన్‌చార్జి ఉపకులపతి ఎన్‌టీకే నాయక్ సూచించారు. బుధవారం రాయలసీమ యూనివర్సిటీలోని హాస్టళ్లలోని డైనింగ్ హాలు, వంటగది, పరిసరాలను పరిశీలించారు.

7న పేరెంట్స్ కమిటీ సమావేశం



మాట్లాడుతున్న ఎంఈవో సునీలమ్మ

గూడూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రతి పాఠశాలలో ఈనెల 7న పేరెంట్స్ కమిటీ సమావేశాన్ని నిర్వహించాలని మండల విద్యాశాఖ అధికారి సునీలమ్మ అన్నారు. బుధవారం గూడూరు పట్టణం లో పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో సునీలమ్మ మాట్లాడుతూ మండలంలోని అన్ని పాఠశాలల్లో పేరెంట్స్ కమిటీ సమావేశాన్ని తప్పక నిర్వహించాలన్నారు. గూడూరు మండలంలో మెగా పేరెంట్స్ టీచర్ల సమావేశం, బెస్ట్ స్కూల్‌గా ఏపీ మోడల్ స్కూల్ ఎంపికైనట్లు వివరించారు. పాఠశాలలకు కేటాయించిన బడ్జెట్‌ను పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందజేశారు.

కాల్వబుగ్గలో వేలం



వేలం నిర్వహిస్తున్న ఆలయ ఈవో మద్దిలేటి

ఓర్వకల్లు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాల్వబుగ్గ రామేశ్వరస్వామి ఆలయంలో ఈవో మద్దిలేటి ఆధ్వర్యంలో బుధవారం బహిరంగ వేలం పాటలు నిర్వహించారు. ఈ వేలం పాటల్లో కొబ్బరి చిప్పలు పోగు చేసుకునేందుకు రూ.13వేలు, షాపు నెంబరు 3కు రూ.50 వేల వేలం పాట పాడి పాటదారులు దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో పాటదారులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

హిందువులకు రక్షణ కల్పించాలి



ప్రసంగిస్తున్న డాక్టర్ వాసురెడ్డి

కర్నూలు కల్చరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న మారణకాండను వెంటనే నిలిపివేసి, వారికి రక్షణ కల్పించాలని ఆర్‌ఎస్‌ఎస్ నాయకుడు, వీఆర్ హాస్పిటల్ అధినేత డాక్టర్ పి.వాసురెడ్డి డిమాండ్ చేశారు. హిందూ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం భారీ ర్యాలీ నిర్వహించారు. కాషాయ పతాకాలు, కాగడాలతో ఈ ప్రదర్శన నగరంలోని వివేకానంద సర్కిల్ (రాజ్‌విహార్) నుంచి కలెక్టరేట్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా డాక్టర్ వాసురెడ్డి మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో ఎందరో అన్నం పెట్టి ఆదుకున్న ఇస్కాన్ సంస్థ నిర్వాహకుడు కృష్ణదాస్ ప్రభును అరెస్టు చేసి హింసించడం తగదని అన్నారు. వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు టీసీ మద్దిలేటి, వీహెచ్‌పీ, బజరంగ్ దళ్, ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ వాటి అనుబంధ మహిళా, యువజన సంఘాలు, వివిధ ఆలయాల కమిటీల ప్రతినిధులు, హిందూ చైతన్య వేదిక, ఆరోగ్య భారతి, సమరసత సేవా ఫౌండేషన్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

రహదారి నిర్మాణం చేపట్టాలి

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): నగరంలోని సంతోష్‌నగర్ డి.మోసెజ్‌నగర్‌లో రహదారి అధ్వాన్నంగా ఉందని, సీసీ రోడ్డు నిర్మించాలని స్థానికులు నగర పాలక సంస్థ మేనేజర్ చిన్నరాముడును బుధవారం కలిసి వినతి పత్రం అందజేశారు. వినతి అందజేసిన వారిలో రియాజ్, మహబూబ్‌బీ, సుశీల, ధీరజ్ ఉన్నారు.

ఎక్స్‌రే తిప్పలు

- మొరాయించిన యంత్రం
- న్యూ డయోగ్నస్టిక్ బ్లాక్‌కు పెరిగిన రద్దీ



ఎక్స్‌రే రూం వద్ద పరీక్షల కోసం వేచి చూస్తున్న రోగులు

కర్నూలు హాస్పిటల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఎక్స్‌రే కోసం రోగులు తిప్పలు పడ్డారు. బుధవారం ఆసుపత్రిలోని డిజిటల్ డైరెక్టు రేడియోగ్రఫీ విభాగంలో ఉన్న యంత్రం సాంకేతిక సమస్యతో మొరాయించింది. డీడీఆర్ ప్రతి రోజు 200 నుంచి 300 మంది ఓపీ రోగులకు ఎక్స్‌రేలు క్యాసెట్ లేకుండా ఫిల్మ్‌లు తీస్తున్నారు. కానీ ఈ మిషన్ మొరాయించడంతో రోగులంతా న్యూడయోగ్నస్టిక్ బ్లాక్‌లో ఉన్న ఎక్స్‌రే కేంద్రాలకు వెళ్లడంతో రోగుల రద్దీ పెరిగింది. ఎక్స్‌రే కోసం గంటల తరడి రోగులు పడిగాపులు కాశారు. ఉదయం 9 గంటలకు ఎక్స్‌రే కోసం వచ్చిన రోగులు మధ్యా హ్నం ఒంటి గంట దాటినా ఎక్స్‌రే పరీక్ష చేయలేదు. రోగులను అదుపు చేయలేక సిబ్బంది అవస్థలు పడ్డారు. దీనికి కూడా ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్ అంతరాయంతో న్యూడయోగ్నస్టిక్ బ్లాక్‌లో రోగులు చీకట్లో ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. విద్యుత్ అంతరాయంతో ఎక్స్‌రే పరీక్షలు మరింత ఆలస్యమయ్యాయి. రోగులు అత్యధికంగా ఉంటే న్యూడయోగ్నస్టిక్ బ్లాక్‌లో అధికారులు కేవలం ఇద్దరు సెక్యూరిటీ గార్డులను నియమించడంతో రద్దీ పెరిగి ఆలస్యమయ్యాయి. రేడియాలజి విభాగంలో డీడీఆర్ యంత్రంలో సాంకేతిక సమస్య తలెత్తినట్లు అధికా రులు పిర్యాదు చేసినా సైరిక్స్ సంస్థ మాత్రం పట్టనట్లుగా వ్యవహ రించడంతో రోగులు ఇక్కట్లు ఎదుర్కొన్నారు.

పంటల బీమాను వినియోగించుకోండి: జేడీ



హుశేనాపురంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న జేడీ వరలక్ష్మి

ఓర్వకల్లు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పంటల బీమాను వినియోగించుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి వరలక్ష్మి అన్నారు. బుధవారం మండలంలోని కాల్వ, హుశేనాపురం గ్రామాల్లో మండల వ్యవసాయాధికారి సుధాకర్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జేడీ వరలక్ష్మితోపాటు ఏడీఏ శాలురెడ్డి హాజరయ్యారు. ఈసందర్భంగా జేడీ వరలక్ష్మి మాట్లాడుతూ ఈ నెల 15లోపు పప్పుశనగ, వేరుశనగ జొన్న, మొక్కజొన్న, టమోటా పంటలకు పంటల బీమా వర్తింపజేసేందుకు ప్రీమియం చెల్లించాలన్నారు. ఈ ఏడాది రబీ సీజన్‌లో ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన కింద దిగుబడి ఆధారిత బీమాకు సం బంధించిన విషయాలు వెల్లడించారు. అలాగే గంజాయి సాగు చట్టరీత్యా నేరమన్నారు. కంది, శనగ తదితర పంటల తెగుళ్లపై రైతులకు అవగాహన కల్పించారు. అలాగే బ్యాంకుల్లో రుణాలు పొందే విధంగా కౌలు రైతులకు, రైతులకు మేనేజర్లు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎల్‌డీఎం బ్యాం కు మేనేజర్ రామచంద్రరావు, ఏపీఎల్‌సీ కర్నూలు శివకృష్ణ బ్యాంకు మేనేజర్ లక్ష్మన్, ఏఈవో భాస్కర్, రైతు సేవా సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గూడూరు: పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి శ్రీవర్ధన్ రెడ్డి అన్నారు. బుధవారం గూడూరు మండలం పెంచికలపాడు గ్రామంలో రైతుభరోసా కేంద్రంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా రైతులు సాగు చేసిన శనగ, జొన్న, పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈవో లక్ష్మీనారాయణ, ఎంపీఈవో శ్రావణి, రైతులు పాల్గొన్నారు.

15 లోపు రీసర్వే అర్జీలకు పరిష్కారం



మాట్లాడుతున్న సర్వే ఏడీ మునికన్నన్

కల్లూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఈనెల 15వ తేదీ లోపు రీసర్వే అర్జీలకు పరిష్కారం చూపాలని సర్వే ఏడీ మునికన్నన్ అన్నారు. బుధవారం కల్లూరు తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దార్ కె. ఆంజనేయులు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ ఆంజనేయులు మాట్లాడుతూ కల్లూరు మండల పరిధిలో రీసర్వే పూర్తైన 14 గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించగా రైతులు 1646 దరఖాస్తులు అందజేశారన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేర కు 30 రోజుల్లో వాటికి అధికారులు పరిష్కారం చూపాలన్నారు. కార్యక్రమంలో డీటీ శివరాం, ఆర్ఐ రాజేంద్రప్రసాద్, మండల సర్వేయర్ శ్రీనివాసులు, విఆర్వోలు, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

బుడగ జంగాలను ఎస్సీ జాబితాలో చేర్చండి



కేంద్ర మంత్రికి వినతి పత్రం ఇస్తున్న ఎంపీ బైరెడ్డి శబరి

కర్నూలు అర్బన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): బేడ, బుడగ జంగాలను ఎస్సీ జాబితాలో చేర్చాలని ఎంపీ బైరెడ్డి శబరి డిమాండ్ చేశారు. బుధవారం ఢిల్లీలోని పార్లమెంట్ భవన్‌లో కేంద్ర సోషల్ జస్టిస్ అండ్ ఎంపవర్మెంట్ మంత్రి వీరేంద్ర కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బైరెడ్డి శబరి మాట్లాడుతూ కేంద్ర మంత్రి బుడగ జంగాలకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారన్నారు.

నేడు రౌండ్ టేబుల్ సమావేశం

కర్నూలు కల్చరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): హంద్రీ నది దినోత్సవం సందర్భంగా గురువారం 'హంద్రీ నది పరిరక్షణ - ఆవశ్యకత' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు కర్నూలు జిల్లా మేధావుల కన్సార్టియం సంస్థ అధ్యక్షుడు ఆచార్య ఎస్ మన్సూర్ రహమాన్, గాడిచర్ల ఫౌండేషన్ సంస్థ అధ్యక్షుడు కేసీ కల్కూర ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. నగరంలోని మద్దూర్‌నగర్‌లోగల పింగళి సూరన తెలుగుతోట సమావేశ హాలులో గురువారం సాయంత్రం 5 గంటలకు ఈ సమావేశం ఉంటుందని వారు పేర్కొన్నారు.

15 నుంచి రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలు

కర్నూలు స్పోర్ట్స్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా ఫిరంగిపురంలోని డా.రంజన్‌బాబు కమ్యూనిటీ జూనియర్ కళాశాలలో ఈనెల 15, 16 తేదీల్లో రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ రగ్బీ అండర్-15 బాలబాలికల చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం ప్రధాన కార్యదర్శి బి.రామాంజనేయులు బుధవారం తెలిపారు. క్రీడాకారులు 2009, 2010, 2011 సంవత్సరాల్లో జన్మించిన వారు పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని అన్నారు.

విధి నిర్వహణలో బయటికి వెళ్తే చర్యలు

జీజీహెచ్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు



ఉద్యోగులతో మాట్లాడుతున్న సూపరింటెండెంట్

కర్నూలు హాస్పిటల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పరిపాలన విభాగంలో ఉద్యోగులు విధి నిర్వహణలో ఎవరైనా బయటకు వెళితే.. వారిపై చర్యలు తీసుకుంటామని కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ కే.వెంకటేశ్వర్లు హెచ్చరించారు. బుధవారం ఆయన పరిపాలన విభాగం లో తనిఖీ నిర్వహించారు. విధులు నిర్వహిస్తున్న మినిస్టీరియల్ స్టాఫ్ సీట్ల దగ్గరకు వెళ్లి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎఫ్‌ఆర్‌ఎస్, అటెండెన్స్ రిజిస్టర్, రికార్డులను పరిశీలించారు. ఉద్యోగులందరూ సమయపాలన పాటించాలన్నారు. కోర్టు కేసులు, ఇతర కేసులులో నిర్లక్ష్యం చేస్తే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట ఆసుపత్రి ఏవో శ్రీనివాసులు, అకౌంటెంట్ లతీఫ్‌బేగ్ ఉన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు గార్గేయపురం విద్యార్థిని



విద్యార్థిని ఫర్హానాకు కప్పు అందజేస్తున్న ప్రిన్సిపాల్

కర్నూలు స్పోర్ట్స్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి హాకీ పోటీలకు గార్గేయపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఫర్హానా ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు వెంకట్రావు తెలిపారు. బుధ వారం విద్యార్థిని ఫర్హానాను ప్రధానోపాధ్యాయులు రాయలసీమ యూనివర్సిటీ విద్యార్థి సంఘం నాయకుడు రెడ్డిపోగు ప్రశాంత్ అభినం దించారు. అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో నవంబరులో జరిగిన అండర్-14 విభాగంలో జరిగిన ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి హాకీ పోటీల్లో ఫర్హానా ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయికి ఎంపికైంది. మధ్యప్రదేశ్‌లో మదర్సాలలో ఈ నెల 9 నుంచి 12వ తేదీ వరకు జరిగే జాతీయ స్థాయి హాకీ పోటీల్లో ఫర్హానా పాల్గొంటుందని ఫిజికల్ డైరెక్టర్ వెంక టేశ్వర్లు తెలిపారు.

గుండె పోటుతో రైతు మృతి



బతుకన్న (ఫైల్ ఫొటో)

సి.బెళగల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని మారందొడ్డి గ్రామానికి రైతు బతుకన్న (49) బుధవారం గుండెపోటుతో మృతి చెందాడు. బతుకన్నకు భార్య వెంకటేశ్వరమ్మ, ఒక కుమారుడు, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. విషయం తెలుసుకున్న టీడీపీ మండల మాజీ కన్వీనర్ పాండు రంగన్నగౌడు, టీడీపీ మండల కన్వీనర్ గోవిందుగౌడు, తిమ్మప్ప, సోమన్నలు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

జాతి గర్వించదగిన గాయకుడు ఘంటసాల



ఘంటసాల చిత్రపటానికి పూలమాల వేస్తున్న శ్రీశైలం ప్రాజెక్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కొండయ్య, గాయకులు

కర్నూలు కల్చరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): తెలుగు జాతి గర్వించదగిన గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు అని శ్రీశైలం ప్రాజెక్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కొండయ్య కొనియాడారు. బుధవారం ఘంటసాల జయంతి సందర్భంగా నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో ఘంటసాల జయంతి వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఘంటసాల చిత్రపటానికి పుష్పమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలుగు పాటకు ప్రపంచస్థాయి గుర్తింపు తీసుకువచ్చిన ఘనత ఒక్క ఘంటసాలకు చెందుతుందని శ్లాఘించారు. టీజీవీ కళాక్షేత్రం కార్యదర్శి మహమ్మద్ మియా మాట్లాడుతూ ఘంటసాల పేరుపై రాష్ట్ర ప్రభుత్వం గాయకులకు అవార్డులు ఇవ్వాలని కోరారు. కథా రచయిత ఇనాయతుల్లా మాట్లాడారు. కార్యక్రమంలో గాయకులు కొండయ్య, శ్రీనివాసులు, యశోద, శ్రీదేవి పాడిన ఘంటసాల పాటలు ప్రేక్షకులను ఉర్రూతలూగించాయి.

● ఘంటసాల పాట అజరామరం

ఘంటసాల పాటలు అజరామరంగా నిలిచి ఉంటాయని, తెలుగు భాష ఉన్నంత వరకు ఘంటసాల పాట వినిపిస్తూనే ఉంటుందని పలువురు వక్తలు కొనియాడారు. ఘంటసాల 102వ జయంతి సందర్భంగా నగరంలోని పద్మశ్రీ ఘంటసాల గాన కళాసమితి ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని అయకర్ భవన్ కూడలిలోని ఘంటసాల విగ్రహానికి ఘనంగా నివాళులు అర్పించారు. సమితి అధ్యక్షుడు వాసుదేవమూర్తి, ఉపాధ్యక్షుడు కేసీ కల్కూర, అనుబంధ కార్యదర్శి మధురకవి ఎలమర్తి రమణయ్య తదితరుల నిర్వహణలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రముఖ వైద్య నిపుణుడు డబ్ల్యూ సీతారాం, డాక్టర్ బి.శంకరశర్మ, డాక్టర్ పి. చంద్రశేఖర్, శ్రీశైలం ప్రాజెక్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కొండయ్య తదితరులు హాజరయ్యారు వక్తలు మాట్లాడుతూ ఘంటసాల నవరసాలు అలవోలకగా పలికించే ఏకైక గాయకుడు అని కొనియాడారు.

రెండు సెంట్ల స్థలం ఇవ్వాలి: సీపీఐ



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

కర్నూలు రూరల్ డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): వన్‌టౌన్‌లో నివశిస్తున్న పేద ముస్లింలకు రెండు సెంట్ల స్థలం ఇవ్వాలని సీపీఐ నగరకార్యదర్శి సి.రామకృష్ణారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఐ నగర సమితి ఆధ్వర్యంలో బుధవారం ముస్లింలు కర్నూలు అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈసందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ వన్‌టౌన్‌లోని చిన్నమార్కెట్, పెద్దమార్కెట్, గనిగల్లి, గడ్డవీధి, కుమ్మరివీధి, జమ్మిచెట్టు, పూలబజారు తదితర ప్రాంతాల్లో పేద ముస్లింలు ఇంటిస్థలం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇంటి నిర్మాణానికి ప్రభుత్వమే రూ.5లక్షలు మంజూరు చేసి ఇసుక, సిమెంటు, స్టీలు ఉచితంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ వెంకటలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నగర కార్యకవర్గ సభ్యుడు అన్వర్‌బాషా, ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి నాగరాజు, నగర కార్యవర్గ సభ్యుడు భీషన్న, వన్‌టౌన్ మహిళా నాయకురాలు దేవీబాయి, అనూరాధ బాయి, జైబున్‌బీ పాల్గొన్నారు.

స్టేట్ క్యాన్సర్ ఆస్పత్రిని అందుబాటులోకి తేవాలి



ధర్నా చేస్తున్న ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ నాయకులు

కర్నూలు హాస్పిటల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్టేట్ క్యాన్సర్ హాస్పిటల్‌ను రోగులకు అందుబాటులో తేవాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. బుధవారం సమాఖ్య నాయకులు స్టేట్ క్యాన్సర్ హాస్పిటల్ ముందు ధర్నా చేశారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రభుత్వాలు అధికారులు మారుతున్నా క్యాన్సర్ హాస్పిటల్ మాత్రం పూర్తి స్థాయిలో వైద్యసేవలు అందించడంలో నిర్లక్ష్యం జరుగుతుందన్నారు. 2019 జనవరిలో అప్పటి సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేస్తే 2024 మార్చిలో వైసీపీ ప్రభుత్వం హడావుడి హాస్పిటల్‌ను ప్రారంభించిందన్నారు. ఇప్పటి వరకు పూర్తి స్థాయిలో వైద్యసౌకర్యాలు లేకపోవడంతో వైద్యులు కేవలం ఓపీ చూసి పంపిస్తున్నారన్నారు. అలాగే కోట్ల రూపాయలు విలువైన సౌకర్యాలు వచ్చినప్పటికీ వాటిని ఉపయోగించకపోవడం వల్ల క్యాన్సర్ రోగులకు శాపంగా మారిందన్నారు. ఎలక్ట్రిసిటీకి సంబంధించిన పాతబిల్లులు పెట్టుకుని కొంతమంది అధికారులు దాదాపు రూ.50లక్షల నుంచి రూ.60లక్షల వరకు క్యాన్సర్ హాస్పిటల్ నిధులను స్వాహా చేశారన్న ఆరోపణలపై మంత్రి టీజీ భరత్, కలెక్టర్ విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నగర అధ్యక్ష కార్యదర్శులు బాబయ్య, బీసన్న, జిల్లా కార్యవర్గ సభ్యులు చంటి, నగర నాయకులు కృష్ణ, ఎం.శ్రీనివాసులు, నాగరాజు, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమన్న, నగర కార్యదర్శి అశోక్ పాల్గొన్నారు.

నంది నాటక పోటీలను తిరిగి ప్రారంభించాలి

ఏపీ నాటక అకాడమీ చైర్మన్‌కు కర్నూలు కళాకారుల విజ్ఞప్తి



గుమ్మడి గోపాలకృష్ణను సన్మానిస్తున్న పత్తి ఓబులయ్య, కళాకారులు

కర్నూలు కల్చరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నంది నాటక పోటీలు తిరిగి ప్రారంభించాలని టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, కళాకారులు విజ్ఞప్తి చేశారు. ఏపీ నాటక అకాడమీ చైర్మన్‌గా సీనియర్ రంగస్థల నటుడు గుమ్మడి గోపాలకృష్ణను రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నియమించింది. బుధవారం విజయవాడలోని నాటక అకాడమీ కార్యాలయంలో జరిగిన గుమ్మడి గోపాల కృష్ణ ప్రమాణ స్వీకా ర కార్యక్రమానికి కర్నూలు నుంచి పలువురు కళాకారులు హాజరై, గోపాలకృష్ణను సత్కరించారు. ఈ సందర్భంగా కొన్ని ప్రతిపాదనలు ఆయనతోపాటూ టూరిజం శాఖ మంత్రి కందుల దుర్గేష్‌కు లిఖిత పూ ర్వకంగా అందజేశారు. ఈ సందర్భంగా పత్తి ఓబులయ్య మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ హయాంలో వివిధ కళల్లో నిష్ణాతులైన కళాకారులకు హంస, కళారత్న పురస్కారాలులతోపాటూ నగదు అందజేసేవారని గుర్తు చేశారు. నాటక అకాడమీ ద్వారా నంది నాటక పోటీలను ఈ ఏడాదిలో ఏర్పాటు చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం నుంచీ అనుమతి పొందేలా చూడాలని గుమ్మడి గోపాలకృష్ణకు విజ్ఞప్తి చేశారు. అలాగే ప్రతి శనివారం హిందూ ఆలయాల్లో పౌరాణిక, పద్య నాటక ప్రదర్శలు ఏర్పాటు చేస్తూ, పేద వర్గాలకు చెందిన కళాకారులకు ఉపాధి కల్పించే దిశగా చూడాలని, క్రీడా రంగంలోలాగే కళా రంగంలోనూ ఔత్సాహిక యువతకు ప్రోత్సాహకాలు కల్పించేదిశగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని రాష్ట్ర టూరిజం మంత్రి దుర్గేష్‌కు వివరించారు.

రెవెన్యూ సదస్సులను వినియోగించుకోండి

గూడూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులను రైతులంతా వినియోగించుకోవాలని తహసీల్దార్ రామాంజనేయులు అన్నారు. బుధవారం గూడూరులోని తహసీల్దార్ కార్యాలయంలో రెవె న్యూ సదస్సులపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీ ల్దార్ మాట్లాడుతూ ఈనెల 6వ తేదీన చనుగొండ్ల, 7న గూడూరు, 10న పెంచికలపాడు, 11న కె నాగలాపురం, 12న బూడిదపాడు, 13న జులకల్, 17న పొన్నకల్, 18న మునగాల, 19న మల్లాపురం, 20న గుడి పాడు, 21న ఆర్ ఖానాపురం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిం చనున్నట్లు తెలిపారు.

మధ్యాహ్న భోజన పథకం అమలుపై హర్షం

కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ కళాశాలలోని విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పథకం అమలు చేస్తామని రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ ప్రకటించడం హర్షించదగ్గ విషయమని బీజేపీ నంద్యాల జిల్లా అధికార ప్రతినిధి కొట్టె చెన్నయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2018లో నాటి టీడీపీ ప్రభుత్వం సీఎం చంద్ర బాబు నాయుడు ఈ మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేశారన్నారు. 2019 తర్వాత వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పథకాన్ని రద్దు చేశారన్నారు. దీంతో పేద విద్యార్థులు ఇబ్బందులకు గురయ్యారని, మళ్లీ మంత్రి నారా లోకేశ్ మధ్యాహ్న భోజనం పథకం అమలు చేస్తామని ప్రకటించడం పట్ల కొట్టె చెన్నయ్య హర్షం వ్యక్తం చేశారు.

రేపు అవగాహన సదస్సు

కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): కర్నూలు బీసీ భవనంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు బీసీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో విశ్వకర్మ స్కీం ఎంఎస్‌ఎంఈపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఏపీ బీసీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దేవపూజ ధనుంజయాచారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, పరిశ్రమల శాఖ అధికారి, కెనరా బ్యాంకు రీజనల్ మేనేజర్, లీడ్ బ్యాంకు మేనేజర్లు హాజరవుతున్నట్లు తెలిపారు.

జాతీయ కబడ్డీ పోటీలకు ఎంపిక


వేణు(ఫైల్)

ఆలూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి పి.వేణు జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఆంధ్ర జట్టు నుంచి ఎంపికయ్యాడు. ఈనెల 6నుంచి 10వ తేదీ వరకు హర్యాణాలో నిర్వహించనున్న అండర్-19 పోటీల్లో పాల్గొననున్నారు. ప్రిన్సిపాల్ రమాదేవి, వైస్ ప్రిన్సిపాల్ శివ శంకర్, అధ్యాపకులు విద్యార్థిని అభినందించారు. రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు.

పనుల్లో నాణ్యత ఉండాలి


పనులను పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

మద్దికెర, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బురుజుల గ్రామంలో ఉపాధి పనుల కింద వేస్తున్న రహదారి పనుల్లో నాణ్యత ఉండాలని ఏఈ విష్ణు, టీడీపీ నాయకుడు బురుజుల చెన్న కేశవులు, ఎర్రిస్వామి సూచించారు. మంగళవారం బురుజుల గ్రామంలో రూ.18 లక్షతో నిర్మిస్తున్న రహదారి పనులను పరిశీలించారు. రంగస్వామి, జయ్యన్న, కొత్తూరు శ్రీనివాస్ ఉన్నారు.

ఆస్పత్రుల్లో పరికరాలు ఉండేలా చూడాలి


శ్రీనివాసరావుతో వెంకప్ప

ఆలూరు, డిసెంబరు 4, (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరికరాలు అందుబాటులో ఉండేలా చూడాలని ఏపీఎంఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాస రావుకు విన్నవించినట్లు జనసేన పార్టీ ఇన్‌చార్జి తెర్నేకల్ వెంకప్ప బుధవారం తెలిపారు. ఈమేరకు విజయవాడలో కలిసి మాట్లాడానని, ఆలూరు ఆసుపత్రిలో నూతన భవనాన్ని నిర్మించి 6నెలలు గడుస్తున్నా ప్రారంభించలే దన్నారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

ఘంటసాల జయంతి


నివాళి అర్పిస్తున్న సమితి సభ్యులు

ఆదోని టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఘంటసాల 102వ జయంతిని ఘంటసాల సప్తస్వరాల కళాసమితి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. గౌరవాధ్యక్షుడు ఆంజనేయులు, అధ్యక్షుడు నీలకంఠప్ప, ప్రధాన కార్యదర్శి ఎండీ బసవరాజ్ స్వామి చిత్రపటానికి నివాళి అర్పించారు. సాకరే మల్లేశ్వర రావు, ఫిరోజ్ అహమ్మద్, చంద్రశేఖర్ రెడ్డి, మురళీధర్ గౌడ్, సాయినాథ్, రాముడు, దాదాబాషా పాల్గొన్నారు.

డీలర్లు సరుకు ఇవ్వడం లేదు

- ఎమ్మెల్యే విరుపాక్షికి ఆపరేటర్ల మొర
- నేడు ఆలూరుకు జేసీ నవ్య?

ఆలూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రేషన్ డీలర్లు తమకు సరుకు ఇవ్వక పోవడంతోనే వాహనాలను తిప్పడం లేదని ఎండీయూ ఆపరేటర్లు బుధవారం ఎమ్మెల్యే విరుపాక్షికి మొరపెట్టుకున్నారు. ఆంధ్రజ్యోతి దినపత్రికలో కాగితాల్లోనే రేషన్ బియ్యం.. ఏడాదిగా నిలిచిన పంపిణీ శీర్షికన ప్రచురితమైన కథనంపై జిల్లా అధికారులు సీరియస్ అయ్యారు.. ఏడాదిగా వాహనాలు తిప్పకపోయినా జీతం ఎలా చెల్లించాని, నివేదిక ఇవ్వాలని జేసీ నవ్య ఆదేశించడంతో అధికారులు చేతులెత్తేశారు. దీంతో చేసేదేమి లేక ఆపరేటర్లు రాజకీయ నాయకుల వద్దకు పరుగులు పెడుతున్నారు.

నేడు ఆలూరుకు జేసీ?

ఈ వ్యవహారంపై పూర్తిస్థాయి విచారణ చేసేందుకు గురువారం జేసీ నవ్య, జిల్లా సివిల్ సప్లై అధికారి రఘువీర్, పత్తికొండ ఆర్డీవో భరత్ నాయక్ రానున్నట్లు రెవెన్యూ వర్గాల ద్వారా తెలిసింది. విచారణ చేసి, చర్యలు తీసుకునే అవకాశాలు ఉన్నాయి.

బకాయిలను వసూలు చేయాలి


ఈఈ హరిని సన్మానిస్తున్న విద్యుత్ సిబ్బంది

తుగ్గలి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వినియోగదారుల నుంచి బకాయిలను సకాలంలో వసూలు చేయాలని, అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని ఈఈ హరి ఆదేశించారు. బుధవారం తుగ్గలి సబ్‌స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. సిబ్బంది సన్మానించారు. అనంతరం సమావేశంలో మాట్లాడుతూ వినియోగదారులు ఇచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. విద్యుత్ స్థంభాలను మార్చే సమయంలో జాగ్రత్త తీసుకోవాలన్నారు. ప్రమాదాలు చోటుచేసుకోకుండా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. డీఈఈ డి.ఖాజావలి, ఏఈఈ మహేశ్వరరెడ్డి, లైన్ ఇన్‌స్పెక్టర్లు మల్లికార్జున, లైన్‌మెన్లు రామదాసు, వెంకటేశ్ నాయక్, తదితరులు ఉన్నారు.

లక్ష దీపోత్సవాలకు ఏర్పాట్లు

హలహర్వి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జె హోసళ్లి గ్రామంలో ఈనెల 9వ తేదీన లక్ష దీపోత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు పట్టదస్వామి పీఠాధిపతి శంభులింగస్వామి అన్నారు. బుధవారం మాట్లాడుతూ 8వ తేదీన పల్లకోత్సవం నిర్వహిస్తామని, వెయ్యి మంది మహిళలకు కుంకుమ అర్చనలు, పూజలు చేస్తామన్నారు.

పంటలను నమోదు చేసుకోవాలి


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఏడీఏ మోహన్ విజయ్

దేవనకొండ,డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రబీలో పంటలను రైతులు ఈ క్రాప్‌లో నమోదు చేసుకోవాలని ఏడీఏ మోహన్‌విజయ్ సూచించారు. బుధవారం స్థానిక రైతు సేవా కేంద్రాలను పరిశీలించారు. బీమా చేయించాలని వీఏఏలను ఆదేశించారు. ఏఈవోలు రంగన్న, మల్లికార్జున, సలాం ఉన్నారు.

పౌష్టికాహారం లేదు


దుప్పనగుర్తి గ్రామం విహంగ వీక్షణం

- మజరా గ్రామం దుప్పనగుర్తిలో అంగన్‌వాడీ కేంద్రం లేక అవస్థలు
- తమ పరిధిలోకి రాదంటున్న కోటకొండ సిబ్బంది

దేవనకొండ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మజరా గ్రామం దుప్పనగుర్తిలో అంగన్‌వాడీ కేంద్రం లేదు. దీంతో గర్భిణులు, బాలింతలు, పిల్లలకు పౌష్టికాహారం అందడం లేదు. పి.కోటకొండ పంచాయతీకి ఈ గ్రామం మజరాగా ఉంది. 30 సంవత్సరాలు క్రితం పి.కోటకొండ గ్రామంలో ఫ్యాక్షన్ గొడవల కారణంగా ఈ గ్రామం ఏర్పడింది.

అంగన్‌వాడీ కేంద్రం లేక ఇబ్బంది

గ్రామంలో దాదాపు 950మంది నివసిస్తున్నారు. 220 ఇళ్లు ఉండగా, 650 ఓటర్లు కూడా ఉన్నారు. ఇక్కడ పోలింగ్ కేంద్రంలో లేకపోవడంతో పి.కోటకొండకు వెళ్లి ఓటు వేస్తున్నారు. గ్రామంలో ప్రాథమిక పాఠశాల ఉంది. ఇందులో 1 నుంచి 5వ తరగతి వరకు చదువు చెబుతున్నారు. కాని అంగన్‌వాడీ కేంద్రం లేదు. ఈ విషయంలో పలుమార్లు స్పందనలో అర్జీలు ఇచ్చినా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తిరస్కరిస్తున్న సిబ్బంది

పౌష్టికాహారం కోసం 3 కిలోమీటర్ల దూరంలోని పి.కోటకొండ అంగన్‌వాడీ కేంద్రానికి వెళితే మీ గ్రామం మా పరిధిలోకిరాదని అక్కడి సిబ్బంది తమ పేర్లు నమోదు చేయడానికి తిరస్కరిస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. దీంతో తమకు పౌష్టికాహారం అందడం లేదని ప్రజా ప్రతినిధులు స్పందించి, గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

పౌష్టికాహారం ఇవ్వడం లేదు.



నాకు ఇద్దరు కుతుర్లు, ఇప్పుడు మరలా గర్భవతిని. అంగన్‌వాడీ కేంద్రం లేకపోవ డంతో గుడ్లు, పాలు, పౌష్టికాహారం ఇవ్వడం లేదు. **- మహేశ్వరి**

ప్రతిపాదనలు పంపాం



ఆలూరు నియోజకవర్గ పరిధిలో 7 నూతన అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రతిపాదనలు పంపాం. కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతి వస్తే, నూతన అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేస్తాం. కేంద్రం లేనిచోట గర్భిణులు, బాలింతలు, పిల్లలకు ఇతర సెంటర్ల నుంచి పౌష్టికాహారం అందేలా ఏర్పాట్లు చేస్తాం.

- మద్దమ్మ, సీడీపీవో, ఆస్పరి

రేపటి నుంచి రెవెన్యూ సభలు

ఆస్పరి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఈనెల 6 నుంచి జనవరి 7వ తేదీ వరకు రెవెన్యూ గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ శివశంకర్ నాయక్ బుధవారం తెలిపారు. రైతులు, ప్రజలు భూ సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు. 6న తంగరడోణ, 7న యాటకల్లు, 10న ములుగుందం, 11న కైరుపల, 12న డి.కోటకొండ, 13న బిలేకల్, 17న జొహరాపురం, 18న చిన్న హోతూర్, 19న నగురూరు, 20న అలిగెర, 21న చొక్కనహళ్లి, 24న ఆస్పరి, 26న తురవగల్లు, 27న బినిగేర, 28న చిగిలి, 31న చిరుమాం దొడ్డి, జనవరి రెండున శంకరబండ, 3న బనవనూర్, 4న కారుమంచి, 7న ముత్తుకూరులో ఉంటాయని తెలిపారు.

పొలం సమస్యలను పరిష్కరించుకోండి

పత్తికొండ టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల్లో రైతులు సమస్యలను పరిష్కరించుకోవాలని తహసీల్దార్ రమేష్ తెలిపారు. ఈ నెల 6 వ తేదీ నుంచి వచ్చే నెల 4వ తేదీ వరకు పత్తికొండ మండలంలో రెవెన్యూ గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభల్లో రైతులు పొలం సమస్యలు ఉంటే అర్జీలు ఇచ్చి, పరిష్కరించు కోవాలన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులపై దాడులు సహించం


ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబుకు వినతిపత్రాన్ని అందిస్తున్న వెలుగు సిబ్బంది

- ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు
- రక్షణ కల్పిస్తామని వెలుగు సిబ్బందికి భరోసా

పత్తికొండ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): విధుల్లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులపై దాడులు సహించమని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు హెచ్చరించారు. మంగళవారం రాత్రి వెలుగు సిబ్బందిపై దాడి సంఘటనకు సంబంధించి బుధవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యేను వెలుగు సిబ్బంది కలిసి వినతిపత్రం ఇచ్చారు. గతంలో వీఏవోలుగా పనిచేసి అవినీతికి పాల్పడిన నరేంద్ర, పురుషోత్తం, క్రిష్ణవేణి అనే ఉద్యోగులను విధుల నుంచి తొలగించారన్నారు. దీంతో తమపై కక్ష పెంచుకుని భౌతిక దాడులకు పాల్పడ్డారని, రక్షణ కల్పించాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే శ్యాంబాబు ఉద్యోగుల రక్షణ తన బాధ్యతగా తీసుకుంటామని భరోసా ఇచ్చారు. దాడిచేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చామన్నారు. గతంలో జరిగిన అవినీతి అక్రమాలపై విచారణ చేయించి, చర్యలు తీసుకుంటామన్నారు. ఏపీఎం చక్రధర్, నర్సన్న, అరుణ, మునిరంగడు, జనార్దన్, రామాంజినేయులు, ఈరన్న, రాజశేఖర్ పాల్గొన్నారు.

కఠినంగా శిక్షించాలి

పత్తికొండ టౌన్: వెలుగు సిబ్బందిపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని జేఏసీ నాయకులు రాఘవేంద్ర, రవికుమార్, సీసీ శేషప్ప, డిమాండ్ చేశారు. బుధవారం ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఆర్డీవో భరత్ నాయక్‌కు వినతి పత్రం సమర్పించారు. అనంతరం మాట్లాడుతూ విధి నిర్వహణలో ఉన్న వెలుగు సిబ్బందిపై గతంలో వీవోఏలుగా పని చేసిన కుటుంబ సభ్యులు నరేంద్ర, పురుషోత్తం, కృష్ణవేణి పక్కా ప్రణాళికతో ఉసీసీ శేషప్పపై దాడి చేయడానికి ఖండించారు. ఉద్యోగులకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఏపీఎం చక్రిధర్, ముద్దురంగడు, రామాంజనేయులు, లక్ష్మీదేవి, వీవోఏలు సుబ్బలక్ష్మి, వీరమ్మ పాల్గొన్నారు.

పంచాయతీ స్థలాలను ఆక్రమిస్తే చర్యలు


మద్దికెరలో ఆక్రమణలను తొలగిస్తున్న అధికారులు

మద్దికెర, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పంచాయితీ స్థలాలను ఆక్రమిస్తే చర్యలు తప్పవని ఈవోఆర్డీ మద్దిలేటి స్వామి, కార్యదర్శి శివకుమార్ హెచ్చరించారు. బుధవారం గ్రామంలోని బస్టాండు నుంచి పందుల కుంట వరకు కాలువపై నిర్మించిన అక్రమ కట్టడాలను తొలగించారు. ఆక్రమణలతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది ఉందన్నారు. పన్నులను చెల్లించాలని, గ్రామాభివృద్ధికి 27 వ్యాపార దుకాణాలను నిర్మిస్తున్నామన్నారు. తెలుగు యువత ఉపాధ్యక్షుడు చంద్రమోహన్ ఉన్నారు.

ఆలూరు అభివృద్ధికి సహకరించండి


కలెక్టర్‌ను సన్మానిస్తున్న వైకుంఠం దంపతులు

ఆలూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆలూరు నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని టీడీపీ ఆర్గనైజింగ్ కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్, మహిళా నాయకురాలు వైకుంఠం జ్యోతి కోరారు. మంగళవారం కర్నూలులో కలెక్టర్ రంజిత్ బాషాను మర్యాద పూర్వకంగా కలిశారు. జింకలు పొలాలపై దాడిచేస్తున్నాయని, రైతులు నష్టపోతున్నారని వాటిని నియంత్రించాలని కోరారు. వేదవతి, నగరడోణ ప్రాజెక్టులు పూర్తి అయ్యేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. నిలిచిపోయిన జాతీయ రహదారి పనులు పూర్తి చేయాలని కోరారు. ఇందుకు కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు.

విభిన్న ప్రతిభావంతులకు అండగా ఉండాలి


మాట్లాడుతున్న ఎంపీపీ రంగమ్మ

ఆలూరు రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతులకు అండగా ఉండాలని ఎంపీపీ రంగమ్మ, ఎంఈవో-2 చిరంజీవి రెడ్డి డాక్టర్ శ్రీకాంత్ సూచించారు. బుధవారం స్థానిక జూనియర్ కళాశాలలో సాయి దివ్యాంగుల సమాఖ్య ఆధ్వర్యంలో విబిన్న ప్రతిభవంతుల దినోత్సవాన్ని గౌరవాధ్యక్షుడు రామంజనేయులు, వీరేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. దివ్యాంగులైన పిల్లలను తల్లిదండ్రులు తప్పక చదివించాలన్నారు. నూతన చట్టం ద్వారా ప్రభుత్వ ఉద్యోగాల్లో నాలుగు శాతం రిజర్వేషన్ ఉందన్నారు. నాయకులు ఎల్లప్ప, శారద, సెక్రెడ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించండి


మాట్లాడుతున్న అసిస్టెంట్ సిటీ ప్లానర్

ఆదోని టౌన్, డిసెంబరు 4, (ఆంధ్రజ్యోతి): పట్టణంలో నిర్మాణంలో ఉన్న భవనాల ప్లాన్లను నిబంధనలు పాటించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అసిస్టెంట్ సిటీ ప్లానర్ కృష్ణ సింగ్, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ బాల మద్దయ్య అన్నారు. బుధవారం సాయంత్రం మున్సిపల్ కార్యాలయంలో పట్టణంలోని లైసెన్స్‌డ్ సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. 2016 నుంచి ఆన్‌లైన్‌లో మంజూరు అయిన ప్లాన్లలో కొన్ని షార్ట్ ఫాల్‌లో ఉండటం గమనించామని, సంబంధిత ఎల్టీపీలు వాటిని పూర్తి చేసుకోవాలని సూచించారు. నిర్లక్ష్యం వహించే యజమానులకు భారీ జరిమానా విధించే అవకావం ఉందని హెచ్చరించారు.

భారతీయులపై దాడులు ఆపాలి : వీహెచ్‌పీ


వినతిపత్రం అందిస్తున్న వీహెచ్‌పీ నాయకులు

హొళగుంద, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): బంగ్లాదేశ్‌లో భారతీయులపై దాడులను ఆపాలని వీహెచ్‌పీ నాయకులు ఈడిగ నరసింహ ప్రసాద్, బిస్వాస్, పెద్దహ్యాట మల్లయ్య, రమేష్, కృష్ణ, జాంటీ వీరేష్ డిమాండ్ చేశారు. ఈ దాడులను ఖండిస్తున్నామని, బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా ఇండియాలో ఆశ్రయం పొందడంతో కొందరు బంగ్లాదేశీయులు భారతీయులపై దాడులకు పాల్పడం బాధాకరమన్నారు. హిందూ గురు చిన్మయ్‌పై బంగ్లాదేశ్ ప్రభుత్వం దేశద్రోహం కేసు నమోదు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. డీటీ నిజాముద్దీన్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. తిక్కస్వామి, ప్రకాష్, మురళి, వేణు పాల్గొన్నారు.

టీడీపీతోనే అభివృద్ధి


పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ ఓబులేసు, నాయకులు

తుగ్గలి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): టీడీపీతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయనీ సర్పంచ్ ఓబులేసు అన్నారు. బుధవారం జొన్నగిరిలో రూ.9లక్షలతో నిర్మించనున్న మురుగు కాలువల పనులను ప్రారంబించారు. గత ఐదేళ్లలో అభివృద్ధి పనులు చేపట్టలేదని, పంచాయితీలను నిర్వీర్యం చేశారన్నారు. కూటమి ప్రభుత్వం నాలుగు నెలల్లోనే నిధులు మంజూరు చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. బాలన్న, మిద్దె రవికుమార్, లక్ష్మణస్వామి, మీసాల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనుల్లో వివాదం


ప్రజలతో మాట్లాడుతున్న పోలీసులు

- పోలీసుల జోక్యంతో పరిష్కారం

పత్తికొండ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పోస్టాఫీస్ నుంచి ముస్లిం వీధి వరకు వేస్తున్న సీసీ రోడ్డు పనుల్లో పనుల్లో స్వల్ప వివాదం చోటుచేసుకుంది. వివరాలు.. పట్టణంలోని పోస్టాఫీసు సమీపం నుంచి చెరువుకట్టకు అనుకుని ముస్లిం వీధికి నూతన సీసీ రహదారి మంజూరైంది. దీనికి సంబంధించి చెరువుకట్ట సమీపంలో అడ్డుగా ఉన్న కట్టడాలను తొలగించి రహదారి నిర్మించేందుకు సిబ్బంది పనులు చేపట్టారు. రోడ్డును వెడల్పు చేసేందుకు చెరువుకట్టను కొద్దిగా వెడల్పు చేసేందుకు చెరువులో మట్టి వేసే పనులు చేస్తుండగా, స్థానికులు ఇందుకు అభ్యంతరం చెప్పగా, మరి కొందరు రోడ్డు పనులకు మద్దతు తెలిపారు. దీంతో ఇరువర్గాల వాగ్వాదం చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న పోలీసులు చేరుకుని రహదారితో అందరికీ మేలని ప్రభుత్వస్థలాల్లో నిర్మి స్తున్న రహదారికి అభ్యంతరాలు సరికాదని కౌన్సిలింగ్ ఇవ్వడంతో వివాదం సద్దుమణిగింది.

నాణ్యమైన భోజనం అందించాలి

మద్దికెర, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఎంపీడీవో కొండయ్య, ఎంఈవో లు రంగస్వామి, గోపాల్ ఆదేశించారు. బుధవారం ఆదర్శ ఎంపీపీ పాఠశాలలో భోజనాన్ని రుచి చూశారు. భోజనంతోపాటు విద్య అందించాలని సూచించారు. విశ్వనాథ్ ఉన్నారు.

నాయీ బ్రాహ్మణులకు గదులు ఇవ్వాలి

మద్దికెర, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కులవృత్తి చేస్తున్న నాయీ బ్రాహ్మణులకు గదులు కేటాయించాలని ఆ సంఘం అధ్యక్షుడు వీరేంద్ర డిమాండ్ చేశారు. బధవారం పంచాయతీ కార్యదర్శి శివకుమార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. పంచాయతీ దుకాణాలకు డిపాజిట్లు చెల్లించామన్నారు. ఎమ్మెల్యే శ్యాంబాబు దృష్టికి తీసికెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. స్పందించిన కార్యదర్శి మాట్లాడుతూ పంచాయతీ సమావేశాల్లో చర్చిస్తామని హామీ ఇచ్చారు. రామాంజనేయులు, ఓబులేసు, నాగులు, నర్సప్ప వెంకట్రాముడు ఉన్నారు.

నాణ్యత లేకుంటే చర్యలు

దేవనకొండ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రహదారి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించకపోతే చర్యలు తప్పవని పీఆర్ ఏఈఈ ఉదయ్‌కుమార్ హెచ్చరించారు. బుధవారం దేవనకొండలోని సంతమార్కెట్ వద్ద పనులను పరిశీలించారు. రహదారితోపాటు డ్రైనేజీ కూడా నిర్మించాలని కాంట్రాక్టర్లని ఆదేశించారు. చాంద్‌బాషా, వరిముక్కల నాగేశ్వరరావు ఉన్నారు.

పన్నులు వసూలు చేయాలి

తుగ్గలి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆయకట్టు కింద వున్న భూముల నుంచి పన్నులు వసూలు చేయాలని తహసీల్దార్ రమాదేవి ఆదేశించారు. బుధవారం కార్యాలయంలో వీఆర్వోలతో సమావేశం ఏర్పాటు చేశారు. చెరువుల కింద ఉన్న ఆయకట్టు భూముల రైతులు పన్నులు చెల్లిస్తేనే సాగునీటి సంఘాల ఎన్నికలకు అర్హత పొందుతారన్నారు. భూ సమస్యలను సిబ్బంది పరిష్కరించాలన్నారు. డీటీ నాగరాజు, వీఆర్వోలు ఉన్నారు.

6 నుంచి రెవెన్యూ సదస్సులు

ఈ నెల 6 నుంచి రెవెన్యూ సదస్సులు ఉంటాయని తహసీల్దార్ రమాదేవి అన్నారు. 6న బొందిమడుగుల, 10న ముక్కెళ్ల, 11న చెన్నంపల్లి, 13న పెండేకల్, 18న కడమకుంట్ల, 19న పగిడిరాయి, 20న జొన్నగిరి, 21న జి.ఎర్రగుడి, 24న లింగనాయనదొడ్డి, 26న తుగ్గలి, 27న రాతన, 28న ఎద్దులదొడ్డి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు ఉంటాయన్నారు.

మద్దికెర : రైతుల భూ సమస్యలపై ఈ నెల6 నుంచి 27వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ హుశేన్‌సాహెబ్ తెలిపారు. వీఆర్వోలు, వీఆర్ఏలు తప్పక హాజరు కావాలన్నారు. ఈ నెల 6వ తేదీన పెరవలి, 10న ఎడవలి, 12 నుంచి 17 వ తేదీ వరకు మద్దికెర, 19న ఎం.అగ్రహారం, 21న బసినేపల్లి, హంపా, 27 బురుజుల గ్రామాల్లో సభలు ఉంటాయన్నారు.

గ్రామాల సమస్యలు పరిష్కరిస్తాం

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

- తుగ్గలి ఎంపీడీవో విశ్వమోహన్



తుగ్గలి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించి అభివృద్ధికి కృషి చేస్తామని తుగ్గలి ఎంపీడీవో విశ్వమోహన్ అన్నారు. ఆంధ్రజ్యోతికి ఆయన ఇంటర్వ్యూ ఇచ్చారు.

ప్రశ్న: సచివాలయ సిబ్బంది పని తీరును పర్యవేక్షిస్తున్నారా?

జవాబు: మండలంలోని సచివాలయాలను తనిఖీ చేస్తూ సిబ్బంది పనితీరును పర్యవేక్షిస్తున్నాం.

ప్రశ్న:ఉపాధి పనులు కల్పిస్తున్నారా?

జవాబు: వ్యవసాయ పనులు ముగిసిన గ్రామాల్లో కల్పిస్తున్నాం.

ప్రశ్న: పారిశుధ్య పనులు చేయిస్తున్నారా?

జవాబు: గ్రామాల్లో ప్రతి వారం పారిశుధ్య పనులు చేయించి, బ్లీచింగ్ పౌడర్, వేస్టాయిల్ చల్లించి అవసరమైన చోట్ల సీసీ రోడ్లు, మురుగు కాలువలు నిర్మిస్తున్నాం.

ప్రశ్న: పింఛన్ పంపిణీ పూర్తయిందా?

జవాబు: ప్రతి నెలా మొదటి రోజే 90 నుంచి 95 శాతం వరకు పూర్తి చేస్తున్నాం. మిగిలిన వారికి కూడా మరుసటి రోజే పింఛన్ అందజేస్తున్నాం. లబ్ధిదారులు ఇళ్ల వద్ద లేకపోవడంతో వంద శాతం ఇవ్వలేకపోతున్నాం.

ప్రశ్న: 15వ ఆర్థిక సంఘం నిధులు వచ్చాయా?

జవాబు: 15వ ఆర్థిక సంఘం నిధులు పంచా యతీలకు నేరుగా అందుతున్నాయి. మండలానికి వచ్చిన రూ.18 లక్షలను పనులకు ఉపయోగిస్తున్నాం.

ప్రశ్న: సర్వసభ్య సమావేశాల్లో సభ్యులు లేవనెత్తిన సమస్యలను పరిష్కరించారా?

జవాబు: ఇప్పటి వరకు వచ్చిన సమస్యలను సంబంధిత అధికారులకు తెలియజేశాం. పరిష్కరించేలా అధికారులకు సూచనలు చేశాం.

రౌడీయిజాన్ని ఎదుర్కొన్నది బీజేపీ ఒక్కటే

రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పురుషోత్తంరెడ్డి



మాట్లాడుతున్న పురుషోత్తంరెడ్డి

కోసిగి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రౌడీయిజాన్ని, గూండాయిజాన్ని పోరాడి నిలబడింది బీజేపీనే అని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, హైకోర్టు సీనియర్ న్యాయవాది బావ పురం పురుషోత్తంరెడ్డి అన్నారు. బుధవారం కోసిగిలోని కార్యాలయంలో బీజేపీ మండల అధ్యక్షుడు రాముడు, ఆధ్వర్యంలో బీజేపీ మండల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన పురుషోత్తంరెడ్డి మాట్లాడుతూ గతంలో తనపై ఎస్సీ, ఎస్టీ తప్పుడు కేసులు పెట్టించినా భయపడకుండా పోరాడి విజయం సాధించినట్లు తెలిపారు. పోలీసులు ఏ పార్టీ అధికారంలో ఉంటే.. ఆ పార్టీ నాయకు లకు ఊడిగం చేసి తప్పుడు కేసులు పెడితే ఖబర్దార్ అని పోలీసులను హెచ్చరించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్లలో మంత్రాల యం నియోజకవర్గంలో దాడులు, దౌర్జన్యాలు, రాక్షస పాలనను వైసీపీ కొనసాగించిందని, గత స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ నాయకులు కోసిగిలో కొడవళ్లు, కత్తులు పట్టుకుని ఇతర పార్టీ నాయకులను నామినేషన్లు వేయకుండా అడ్డుకున్నారని, అప్పుడు వారిని ధీటుగా ఎదుర్కొంది బీజేపీ ఒక్కటేనన్నారు. సమావేశంలో బీజేపీ ఎంపీటీసీలు పెండేకల్లు నరసమ్మ, గుడిసె అయ్యమ్మ, కడిదొడ్డి ఈరమ్మ, కురువ మారన్న, పెండకల్లు నరసన్న, తిక్కయ్య, ఆర్లబండ హుశేని పాల్గొన్నారు.

గృహ నిర్మాణాల పరిశీలన



నాగలదిన్నెలో గృహ నిర్మాణాలను పరిశీలిస్తున్న అధికారులు

నందవరం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగలదిన్నెలోని మైనార్టీల గృహనిర్మాణాలను ఎంపీడీవో పుల్లయ్య, హౌసింగ్ డీఈ ప్రసాద్, ఈవోపీఆర్డీ సందీప్ బుధవారం పరిశీలించారు. అలాగే మూతపడ్డ ఆర్వో ప్లాంట్‌ను పరిశీలించారు. అనంతరం సోమల గూడురు, పొణకలదిన్నె గ్రామాల్లో సచివాలయాలను పరిశీలించారు. సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీవో శ్రీనివాసులు, మాజీ సర్పంచ్ టీ ఈరన్న, తిమ్మప్ప, పంచాయతీ కార్యదర్శి నౌషన్న, అధికారులు పాల్గొన్నారు.

ఇంటి స్థలాలను కేటాయించాలి

ఎమ్మిగనూరు రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరులో పని చేస్తున్న హోంగార్డులకు ఇళ్లస్థలాలు కేటాయించాలని హోంగార్డులు భాస్కర్‌రెడ్డి, కృష్ణ, చెన్నప్ప, మున్న, గోపాల్‌రావు, నరసింహులు, గోవిందు, గోపాల్, ఫయాజ్ కోరారు. సోమవారం తహసీల్దార్ శేషఫణిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొంతకాలంగా ఇంటి స్థలాల కోసం పోరాడుతున్నామన్నారు. తక్కువ వేతనంతో జీవనం సాగిస్తున్న తమకు ఇంటటి స్థలాలు కేటాయించాలని కోరారు.


ఎమ్మిగనూరు రూరల్ సీఐగా మధుసూదన్‌రావు

ఎమ్మిగనూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు రూరల్ సీఐగా మధుసూదన్‌రావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. రూరల్ సీఐగా పనిచేస్తున్న బీవీ విక్రమసింహ కర్నూలు వీఆర్‌కు బదిలీ కావడంతో ఆయన స్థానంలో కర్నూలు సీసీఎస్ సీఐగా పనిచేస్తున్న బీవీ మధుసూదన్ రావును ఎమ్మిగనూరు రూరల్ సీఐగా బదిలీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎమ్మిగనూరు సర్కిల్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం సీఐ స్థానిక ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డిని కలిశారు. కాగా, మూడు నాలుగు నెలల వ్యవధిలో అటు పట్టణ సీఐ సుదర్శన్ రెడ్డి, ఇటు రూరల్ సీఐ బీవీ విక్రమసింహ బదిలీ కావటం చర్చనీయాంశంగా మారింది. నెలల వ్యవధిలో సీఐ స్థాయి అధికారులను ఆకస్మికంగా బదిలీలు చేయడంపై పాలక ప్రభుత్వంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

బాల బాలికల భద్రత అందరి బాధ్యత: సీఐ

గోనెగండ్ల, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మహిళలు, బాలబాలికల భద్రత అందరి బాధ్యత అని గోనెగండ్ల సీఐ గంగాధర్ అన్నారు. బుధవారం పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ లైంగిక నేరాల నుంచి పిల్లలను రక్షించాలన్నారు. బాల్యవివాహాలు, బాలల భిక్షాటనను పూర్తిగా నిర్మూలించాలన్నారు. బాలికలకు గుడ్‌టచ్ బ్యాడ్ టచ్ గురించి అవగాహన కల్పించాలని, మహిళలు బాలికల పట్ల జరుగుతున్న దాడులను అరికట్టాలని అందుకు ప్రజల సహకారం ఎంతో అవసరం అన్నారు. బాలికల రక్షణ కోసం చైల్డ్‌లైన్ కోసం 1098 కిగాని హైల్ప్‌లైన్ 181కు గాని, పోలీస్ డయల్ 100 గాని సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు.

వజ్రోత్సవ పోస్టర్లు విడుదల



పోస్టర్లను విడుదల చేస్తున్న తహసీల్దార్ శేషఫణి, దళిత రచయితల సంఘం నాయకులు

ఎమ్మిగనూరు రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన భారత రాజ్యాంగ వజ్రోత్సవాల పోస్టర్లను తహసీల్దార్ శేషఫణి, దళిత రచయితల సంఘం గౌరవ అధ్యక్షులు కదిరికోట ఆదెన్న, దళిత రచయితల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు ఆరెకంటి భాస్కర్ బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం 448 ఆర్టికల్స్, 12 షెడ్యూల్, 25 భాగాలతో ప్రపంచంలోనే అతిపెద్ద రాజ్యాంగంగా అవతరించిందన్నారు. రాజ్యాంగ రచనకు డా. బీఆర్ అంబేడ్కర్ చేసిన కృషి మరువలేనిదన్నారు. ఉపాధ్యాయులు మాధన్న, లెక్చరర్ రంగస్వామి, కొమ్మినేని భోజరాజు, విద్యార్థి నాయకులు ఈరేష్ పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

గోనెగండ్ల, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పరిసరాల శుభ్రత అందరి బాధ్యతగా భావించాలని ఈవోఆర్డీ అనంతశయన, పంచాయతీ కార్యదర్శి సతీష్ అన్నారు. బుధవారం మండల కేంద్రమైన గోనెగండ్లలోని పలు వీధుల్లో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం చేపట్టారు. కాలువలో నిండిన చెత్తను, ముళ్ల పొదలను ట్రాక్టర్, జేసీబీలతో తొలగించారు. ఈ సందర్భంగా ఈవోఆర్డీ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో పంచాయతీ సిబ్బంది పారిశుధ్య పనులు చేపట్టాలని అందుకు ఆయా గ్రామాల ప్రజలు కూడా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మలాంగ్‌బాషా, అనిల్, సుబాన్, అనిల్ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

బీమాతో రైతన్నకు భరోసా

- ఆరు పంటలకు వర్తింపు
- కూటమి ప్రభుత్వం రైతులకు కల్పించిన వరం
- డిసెంబరు 15లోగా ప్రీమియం చెల్లించాలి



నీట మునిగిన పత్తి పంట

గోనెగండ్ల, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పశ్చిమ ప్రాంత రైతులు ఎక్కువగా వర్షాధారంపైనే ఆధారం పడి పంటలు సాగు చేస్తుంటారు. రైతులు పంటలు సాగు చేసిన నాటి నుంచి పంట చేతికి వచ్చే లోపు అతివృష్టి, అనావృష్టితో నష్టపోవాల్సి వస్తుంది. ఎకరాలో ఏ రకమైన పంటను సాగు చేయాలన్నా కనీసం రూ. 25వేల నుంచి రూ. 30వేల వరకు ఖర్చు చేయాల్సిఉంటుంది. రైతుల ఇబ్బందులు తెలిసిన కూటమి ప్రభుత్వం బీమా కంపెనీలతో ఒప్పందం చేసుకుంది. వేరుశనగ, వరి, పప్పుశనగ, జొన్నలతోపాటు టమోటా, ఉల్లి, పంటలకు బీమా వర్తింపజేస్తుంది.

బీమా ఉంటే నే రైతన్నకు ధీమా

తుఫాన్, భారీ వర్షాలు వరదల కారణంగా పంటలు నష్టపోయినప్పుడు ప్రభుత్వం పరిశీలించి నష్టపోయిన రైతులకు ఏ పంటకు ఎంత నష్టపరిహారం చెల్లించాలో బీమా పథకం దోహద పడుతుంది. పంట విలువలను అంచనావేసి బీమా కంపెనీలు పరిహారం అందిస్తుంటాయి. పంట పై రైతులు రుణాలు తీసుకుంటే బ్యాంక్ అధికారులే పంట బీమా ప్రీమియం చెల్లిస్తారు. పంట బీమా రైతులు సకాలంలో చెల్లించకపోతే విపత్తు సమయంలో పంట నష్టపోతే పరిహారం అందక రైతులు నష్టపోతారు. గోనెగండ్ల మండలంలో దాదాపు 15,885 మంది రైతులు ఉన్నారు.

డిసెంబరు 15లోపు ప్రీమియం చెల్లించాలి

గోనెగండ్ల మండల పరిధిలోని 28 గ్రామాలలో ఇప్పటి వరకు రబీ సీజన్‌లో 6800 ఎకరాల వరకు సాగు అయినట్లు తెలుస్తుంది. ఈ పంట భూమిలో పప్పుశనగ, వేరుశనగ, వరి, జొన్న, ఉల్లి, టమోటాలతోపాటు ఇతరత్ర పంటలను కూడా సాగు చేశారు. సాగు చేసిన పంటలకు బీమా ప్రీమియం చెల్లించేందుకు గాను ప్రభుత్వం డిసెంబరు 15 అఖరి తేదీగా నిర్ణయించింది. ఈ క్రాప్ చేయించుకున్న రైతులు పంటలకు ప్రిమియం చెల్లించాల్సి ఉంది. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజనలో పప్పుశనగ, వరి, జొన్న, వేరుశనగ, ఉల్లి పంటలను చేర్చింది.

ప్రభుత్వం నిర్ణయించిన బీమా ప్రీమియం మొత్తం

పంట రకం	పంట బీమా ప్రీమియం మొత్తం ఎకరాకు రూ.లలో
టమోటా	రూ. 1500
వరి	రూ. 630
వేరుశనగ	రూ. 480
పప్పుశనగ	రూ. 420
ఉల్లి	రూ. 1350
జొన్న	రూ. 297



ప్రీమియం చెల్లిస్తేనే పరిహారం:



రైతులు పంట నష్టపరిహారం కోసం ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. ఈ ప్రీమియం ను డిసెం బరు నెల 15వ తేదీ లోపు ప్రభుత్వం నిర్ణయించిన మొత్తాన్ని చెల్లించాలి. వాతావరణ పరిస్థితుల కారణంగా వరదలు తుఫాన్లు వల్ల పం టలు నష్టపోతే రైతులందరికీ నష్టపరిహారం బీమా కంపెనీలు అందజేస్తాయి.

- మహమ్మద్ ఖాద్రీ, ఏడీఏ ఎమ్మిగనూరు

పనులు త్వరగా పూర్తి చేయాలి

- ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ఆదేశం
- ఆసుపత్రి పనుల పురోగతిపై అసంతృప్తి



వంద పడకల ఆసుపత్రి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

ఎమ్మిగనూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణంలో నిర్మాణంలో ఉన్న వంద పడకల ఆసుపత్రి పనులు వచ్చేనెల మొదటి వారంలో పూర్తి చేయాలని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ఆదేశించారు. పనుల పురుగతిపై అసంతృప్తి వ్యక్తం చేశారు. బుధవారం ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధి కమిటీ సమావేశం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది ఖాళీలు ఇతర సమస్యలపై చర్చించారు. అలాగే ఆసుపత్రికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అలాగే నిర్మాణంలో ఉన్న వందపడకల ఆసుపత్రి పనులు, శిథిలమైన వైద్యసిబ్బంది క్వార్టర్స్‌ను పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తన తండ్రి స్వర్గీయ బీవీ మోహన్ రెడ్డి ఉన్న సమయంలో వందపడకలు నిర్మాణానికి అంకురార్పణ చేశారన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో వందపడకలకు నిధులు మంజూరు చేయించామన్నారు. అయితే ఆపనులు నేటికి పూర్తి కాకపోవటం సరికాదన్నారు. పనులు వేగవంతగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కాంట్రాక్టర్‌ను, సంబంధింత శాఖ అధికారులను ఆదేశించారు. పనులు జనవరి మొదటి వారంలో పూర్తి చేసి ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందిస్తామన్నారు. వందపడకల ఆసుపత్రి ప్రారంభ సమయంలోనే ట్రామాకేర్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. ఆసుపత్రిలో ఏమైన సమస్యలు ఉన్నట్లైతే తన దృష్టికి తీసుకోస్తే వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఆసుపత్రి సూపరండెంట్‌ను కోరారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ సుధ, వైద్యులు బాలాజీ, మల్లికార్జున, చిరంజీవి, హెచ్‌డీసీ మెంబర్స్ సురేష్ చౌదరి, రామకృష్ణ నాయుడు, నాయకులు మహేంద్ర, రంగస్వామి గౌడ్, నవాజ్, శం కర్ గౌడ్, సలీం, అంబేడ్కర్, శాలేమ్ పాల్గొన్నారు.

● **సెంట్రల్ లైటింగ్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే:** పట్టణంలోని ఎంజీ పెట్రోల్ బంక్ నుంచి వెంకటాపురం బీటీ రోడ్డు వరకు రూ. 25లక్షలతో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్స్‌ను ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, టీపీవో రాజేష్, డీఈ,ఏఈలు, నాయకులు పాల్గొన్నారు.

రైతుకు తప్పని ఫెంగల్ ఎఫెక్ట్



మిరపపై పట్టలు కప్పుతున్న రైతులు

కౌతాళం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఇటీవల ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో అన్నదాతలకు ఇబ్బందులు తప్పలేదు. తుఫాన్ ప్రభావంతో మిర్చి, పత్తి, మిరప రైతులపై తీవ్ర ప్రభావం చూపింది. బుధవారం తుఫాన్ ప్రభావం రైతులపై చూపింది. చేతికి అందిన పంటను కాపాడుకునేందుకు రైతులు పట్టలు కప్పేందుకు నానా అవస్థలుపడ్డారు.

ఎరిగేరిలో కబడ్డీ టోర్నమెంట్

కౌతాళం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా బుధవారం మండల పరిధిలోని ఎరిగేరి గ్రామంలో అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో కబడ్డీ టోర్నమెంట్‌ను నిర్వహించారు. ముందుగా అంబేడ్కర్ దంపతుల చిత్రపటానికి నివాళి అర్పించారు. అనంతరం సంఘం నాయకుడు వీరేష్ మాట్లాడుతూ దేశ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ దాదా సాహెబ్ అంబేడ్కర్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరు పాటుపడాలన్నారు. టీడీపీ కౌతాళం టౌన్ అధ్యక్షుడు కాశీ విశ్వనాథ టౌర్నమెంట్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు వీరేష్, ఎమ్మార్పీఎస్ కౌతాళం మండల అధ్యక్షుడు గుడికంబాలి ఆనంద్, మాజీ అధ్యక్షుడు రాజబాబు, కౌతాళం సర్పంచ్ పాల్‌దినకరన్, మాజీ సర్పంచ్ అవతారం వివిధ గ్రామాల దళిత సంఘాల నాయకులు తిమోతీ, పాల్గొన్నారు.

విద్యార్థులకు గుణాత్మక విద్య అందించాలి

పెద్దకడుబూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల అభ్యసన, సామర్థ్యాలను మెరుగుపరచడానికి, గుణాత్మక విద్య అందించడానికి జాతీయ సాధన సర్వే పరీక్షలు ఉపయోగపడుతుందని ఎంఈవో -2 రామ్మూర్తి అన్నారు. మండల పరిధిలోని నౌలేకల్ ఎంపీయూపీ, పెద్దకడబూరు ఎంపీపీ మెయిన్ స్కూల్, పెద్దకడబూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 9వ తరగతి విద్యార్థులకు జాతీయ సాధన సర్వే పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేదల జీవన నైపుణ్యం

పెంచడమే ఆర్డీటీ లక్ష్యం



పేతురు కుటుంబంతో స్పెయిన్ దేశస్థురాలు

మంత్రాలయం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ఉండే పేదల కుటుంబాల్లో జీవననైపుణ్యం పెంచి వారిని అన్ని రకాలుగా అభివృద్ధే చేయడమే ఆర్డీటీ లక్ష్యమని స్పెయిన్ దేశానికి చెందిన మారీనా,మార్టినాలు అన్నారు. బుధవారం మండలం లోని వగరూరు గ్రామానికి చెందిన బాలరాజు,రోజ కుటుంబాన్ని సందర్శించి ఆర్డీటీ ద్వారా అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులకు దుస్తులు, ఇంటి సరుకులు, మిఠాయిలు అందజేశారు. కార్యక్రమంలో ఏరియా టీం లీడర్ కృష్ణయ్య, సీఓ నరసింహులు, ఆర్డీటీ లీడర్లు లాజరు, సంసోను, మత్తయ్య, మునెప్ప, ఆదాము, ఏసేపు, దానియేలు, రామయ్య, నరసింహులు, ఏసేబు, భూపతి, జానయ్య పాల్గొన్నారు.


కల్యాణ మండపం ప్రారంభం



కళ్యాణ మండపం ప్రారంభోత్సవంలో పీఠాధిపతి

మంత్రాలయం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి మఠం ఆధ్వర్యంలో హైదరాబాదు రామాంతపురంలో రూ.1.35 కోట్లతో నంద్యాల జిల్లా పాణ్యం చెందిన పారిశ్రామికవేత్త బద్రినాథ్ నిర్మించిన పరిమళ కన్వర్షన్ కల్యాణ మండపాన్ని మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు బుధవారం ప్రారంభించారు. అనంతరం అక్కడే సంస్థాన పూజ చేసి భక్తుల నుద్దేశించి మాట్లాడారు. కల్యాణ మండపాన్ని నిర్మించి రాఘవేంద్రస్వామి మఠానికి విరాళంగా ఇచ్చిన దాత బద్రినాథ్ కుటుంబ సభ్యులకు శేషవస్త్రం, ఫలపుష్ప మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. కార్యక్రమంలో మఠం మాజీ మేనేజర్ ఎస్కే శ్రీనివాసరావు, ఆనంద తీర్థాచార్, ద్వారపాలక అనంతస్వామి, ప్రకాషాచార్, పవానాచార్, తదితరులు పాల్గొన్నారు.

కమ్మేసిన పొగమంచు



ఎమ్మిగనూరు బైపాస్ రోడ్డులో లైట్లు వేసుకొని వస్తున్న వాహనదారులు

ఎమ్మిగనూరు/ కౌతాళం/ కోసిగి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): శీతాకాలం కావటంతో గత రెండు మూడు రోజులుగా ఎమ్మిగనూరు డివిజన్‌లోని ఎమ్మిగనూరు, కౌతాళం కోసిగిలో పొగమంచు కమ్మేస్తోంది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. బుధవారం ఆయా ప్రాంతాలతో పాటు ప్రధాన రహదారులైన ఆదోని, కర్నూలు, మంత్రాలయం రహదారులను పొగమంచు కమ్మెసింది. ఉదయం 7.30 గంలైన పొగమంచు తగ్గకపోవటంతో ఆయా రహదారుల్లో ప్రయాణించే వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. పొగమంచుతో ఎదురుగా వస్తున్న వాహనాలు దగ్గరకు వస్తేగాని కనిపంచని పరిస్థితి ఏర్పడింది. ఇక శివారు కాలనీల్లో పొగమంచు కమ్మేయటంతో అటుగా వెళ్లే రహదారులు కనిపించని పరిస్థితి ఏర్పడింది.



కోసిగిలో ఉదయం 8 గంటల సమయంలో పొగమంచు



కౌతాళంలో..

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న ప్రాజెక్ట్ కార్యదర్శి గోవర్ధనమ్మ

ఎమ్మిగనూరు టౌన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యదర్శి గోవర్ధనమ్మ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని కార్యాలయంలో అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్ల ప్రాజెక్ట్ కార్యకర్తల విస్తృత సమావేశం ప్రాజెక్ట్ అధ్యక్షురాలు శైలజ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ గోవర్ధనమ్మ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో టీడీపీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీఐటీయూ మండల అధ్యక్షుడు గోవిందు, కార్యదర్శి రాముడు, ఏఐకేఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు హనుమంతు. అరుణ, భాగ్యమ్మ, నీరజ, శారద, నాగలక్ష్మీ, అనూరాధ పాల్గొన్నారు.

వీరసేనారెడ్డి మృతి పార్టీకి తీరని లోటు



వీరసేనా రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న తిక్కారెడ్డి

పెద్దకడుబూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): టీడీపీ నాయకుడు వీరసేనా రెడ్డి మృతి పార్టీకి తీరని లోటు అని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి విచారం వ్యక్తం చేశారు. బుధవారం మండల కేంద్రమైన పెద్దకడబూరులోని మాజీ ఎంపీపీ హనుమంతు రెడ్డి తనయుడు వీరా సేనా రెడ్డి అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, టీడీపీ యువనాయకుడు రామకృష్ణ రెడ్డి ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు మధుసూదన్‌రెడ్డి, దశరథరాముడు, మల్లికార్జున, ఏసేబు, మీసేవ ఆంజినేయులు, నీలకంఠ రెడ్డి, విజయ్ కూమార్, రామాంజినేయులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలపై ప్రత్యేక నిఘా: డీఎస్పీ



పోలీసులతో మాట్లాడుతున్న డీఎస్పీ

నందవరం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతలపై ప్రత్యేక నిఘా ఉంచాలని డీఎస్పీ ఉపేంద్రబాబు సూచించారు. బుధవారం నందవరం పోలీస్టేషన్‌ను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ప్రమాదానికి గురైన వాహనాల గురించి ఎస్ఐ శ్రీనివాసులును అడిగితెలుసుకున్నారు. మండలంలో అసాంఘిక కార్యక్రమాలకు తావు లేకుండా చూడాలన్నారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులకు చట్ట ప్రకారం న్యాయం చేయాలని నిజాయతీగా పనిచేసి డిపార్టమెంట్‌కు మంచి పేరు తీసుకురావాలని పోలీసులను ఆదేశించారు.

సీసీ రోడ్డు నాణ్యత పరిశీలన



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న అధికారులు

మంత్రాలయం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిలకలడోన గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులపై పంచాయతీరాజ్ డీఈ ఈరన్న, ఏఈ మల్లయ్య తనిఖీ చేశారు. బుధవారం దళిత కాలనీల్లో సీసీ రోడ్లు కాంట్రాక్టరు సక్రమంగా వేయకుండా తూతూమంత్రంగా వేసిన రోడ్డును పూర్తిగా నాశనమైందని ఆదోనిలో సబ్ కలెక్టర్‌కు ఎంఆర్‌పీఎస్ నాయకులు రంగన్న ఫిర్యాదు చేయడంతో ఆయన ఆదేశాల మేరకు సీసీ రోడ్డు కాంట్రాక్టరు, యజమానిపై వచ్చిన ఫిర్యాదు మేరకు అధికారులు తనిఖీ చేసి విచారణ చేశారు. కొలతలు, నాణ్యత ప్రమాణాలు పాటించారా లేదన్న విషయాన్ని రికార్డులో నమోదు చేసుకున్నారు.

జగనన్న కాలనీలో దొంగలు పడ్డారు

పెద్దకడుబూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జగనన్న కాలనీలో దొంగలు పడ్డారని టీడీపీ జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి బొగ్గుల నరసన్న అన్నారు. బుధవారం మండల కేంద్రమైన పెద్దకడబూరులోని జగనన్న కాలనీని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణం అసంపూర్తిగా ఉన్నాయన్నారు. ఇదే అదునుగా భావించిన దొంగలు ఇసుక, కంకర, సిమెంట్ బ్రిక్స్‌లను దొంగలించారన్నారు. అధికారుల పర్యవేక్షణ, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వలన దొంగతనాలు జరుగుతున్నాయన్నారు. సంబంధిత అధికారులు స్పందించి దుండగులను గుర్తించి కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే నిర్మాణాలు పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయాలన్నారు.